
భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36.0
కనిష్ఠం : 27.0

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
ఆదివారం 29 జూన్ 2025



'ఇప్పటి వరకు చేసిన మంచి పనులన్నింటిని ప్రజలకు వివరించడంలో కొంత వెనుకబాటు ఉంది. ఇకపై ఉన్నది ఉన్నట్లు ప్రజాక్షేత్రంలో అందరికీ అవగాహన ఉండేలా వివరించాలి. ఏడాది పాటు అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రజలు మెచ్చేలా వారు కోరుకున్న విధంగా ఏ పథకాలను అమల్లోకి తీసుకువచ్చిందీ వివరించడానికి సన్నద్ధంకండి. వచ్చే నెలలోనే జనం మధ్యకు మంత్రులు, ఎమ్మెల్యేలతోపాటు కూటమి నేతలను కలుపుకుని వెళ్లండి'

- పార్టీ ముఖ్యులకు సీఎం చంద్రబాబు చేసిన హితబోధ.



'చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ.. ఏడాది కాలంలో సీఎం చేసిన మోసాలను, మాట తప్పిన విధానాలను ప్రజలకు వివరించండి. ఐదు వారాలపాటు ఊరూరా, ఇంటింటా ప్రచారం చేయండి. ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్ చేసిన శపథాలను గుర్తు చేసి ప్రజలకు తెలియచెప్పండి. ఎప్పుడో నెరవేర్చాల్సిన హామీలను ఎందుకు అమలు చేయలేదంటూ ప్రశ్నించండి'..

- పార్టీ విస్తృత సమావేశంలో మాజీ సీఎం జగన్ ఆదేశం

జనంలో తేల్చుకుందాం

రైతు సమస్యలపై ఎక్కడా పట్టించుకోవట్లేదు. ఎన్నికల ముందో మాట, ఆ తర్వాత ఇంకోమాట. చాలా పంటలు వేసిన రైతులు నష్టపోతున్నారు. వీరిని ఆదుకునేందుకు ఇప్పటి వరకు ఏం చర్యలు తీసుకున్నారు. కోకో పంట దగ్గర నుంచి పొగాకు వరకు అన్నీ సమస్యలే. రైతులకు న్యాయం జరిగేంత వరకు పోరాటాలు చేస్తున్నాం. ప్రజా సమస్యలపై నిత్యం పోరాటాలకు సన్నద్ధం కావాలి. ప్రజా పక్షాన జరుగుతున్న ఆందోళనలు, నిరసనలు కొనసాగిస్తాం.. పార్టీ అంతర్గత సమావేశాల్లో వామపక్షాల సంకేతాలివి.

మినీ ఫైట్‌కు అధికార.. ప్రతిపక్షాలు

వచ్చే నెల నుంచి ప్రజల మధ్యకు మంత్రులు, ఎమ్మెల్యేలు

అభివృద్ధి, సంక్షేమం తెలియజెప్పేందుకు.. ఐదేళ్ల వైసీపీ నిర్వాకాలు ఎండగట్టేందుకు

కూటమిపై అక్కసు వెళ్లగక్కడానికి ఐదు వారాలపాటు ఇంటింటికి వైసీపీ

వామపక్షాలు ఉగ్రతాండవం.. ఆందోళనల స్పీడ్ పెంచాలని యోచన

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)



కూటమి ప్రభుత్వ ఏడాది కాలం పూర్తయిన నేపథ్యంలో సర్కారు ఓ వైపు, విపక్షాలు ఇంకోవైపు ప్రజా క్షేత్రం వైపు కదులుతున్నాయి. తాము చేసిన మంచి పనులేవో ప్రజలకే వివరించేందుకు, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన నష్టం, ధ్వంసమైన వ్యవస్థలు, తాము ఏడాది కాలంలో ఒక్కొక్కటిగా సరిదిద్దుకుని వస్తున్నామో వివరించేందుకు కూటమి సన్నాహాలకు దిగింది. ఈ మేరకు వచ్చే నెల మొదటి వారం నుంచి ఊరూ, వాడా కలియ తిరగాలని, ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలని, కొన్నింటిలో అడ్డం తగులుతున్న వైసీపీ తీరుతెన్నులను ప్రజల ఎదుటే చర్చించేందుకు సిద్ధమవుతోంది. ఏడాదైన సందర్భంగా తాము అమలు చేసిన పథకాలు, అవి ప్రజలకు ఉపయోగపడిన విధానంపై సంఖ్యా పూర్వకంగా వివరించాలని నిర్ణయించింది. ఉమ్మడి పశ్చిమలో 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూటమి ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలుండగా వీరంతా కలిసి ప్రజాక్షేత్రంలోకి వెళ్లేందుకు రంగం సిద్ధం చేశారు. పార్టీ సూచనల మేరకు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసుకున్నారు. రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారథి తమ నియోజకవర్గాలైన పాలకొల్లు, నూజివీడుల్లో అభివృద్ధి కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తున్నారు.



టీడీపీ, జనసేన, బీజేపీలు ఉమ్మడిగానే ప్రజా క్షేత్రంలో ఏడాది పాలన విజయాలను చేరువ చేసేందుకు సిద్ధపడుతోంది.

ఎర్రజెండాలది.. ఇంకోరూటు

వివిధ అంశాలపై ఎడతెరిపి లేకుండా ఆందోళనలు, నిరసనలు కొనసాగిస్తున్న వామపక్ష పార్టీలు సాధ్యమైనంత మేర మరిన్ని అంశాలపై దూసుకుపోవాలని భావిస్తున్నాయి. ఈ మధ్య

(మిగతా 8వ పేజీలో)

• మేం తక్కువ తిన్నామా

అధికారంలో ఉన్నప్పుడు అరాచకాలకు నెలవైన వైసీపీ పాలన.. ఇప్పుడు కూటమి ప్రభుత్వాన్ని ఇరకాటంలో నెట్టేందుకు విశ్వప్రయత్నాలు ఆరంభించింది. ఒకవైపు టీడీపీ, జనసేన, బీజేపీలు ప్రజల మధ్యకు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా.. మేం తక్కువ తిన్నామా అనే విధంగా వైసీపీ సైతం చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ ఇంటింటా ప్రచారం చేయాలని నిర్ణయించింది. చీటికి మాటికి చికాకులతో ఐదేళ్లు గడిచిపోగా, ఏడాది క్రితమే అధికారపగ్గాలు చేపట్టిన కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చే నెల నుంచే ఐదు వారాలపాటు ఊరూరా ప్రచారం చేయాలని మాజీ సీఎం జగన్ పిలుపునిచ్చారు. జిల్లా నుంచి గ్రామస్థాయి వరకు ఎలా సాగాలో సంకేతాలు వెలువడ్డాయి. జూలై మాసమంతా ఫ్యాన్ పార్టీ నేతలు అదేపనిలో ఉండబోతున్నారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో వైసీపీ శ్రేణులు బలహీనపడ్డాయి. కన్వీనర్లు చతికిలపడ్డారు. ఉమ్మడి పశ్చిమలో సగానికి సగం నియోజకవర్గాల్లో ఇదేతీరు. అయినా సరే పార్టీలో కొంత కదలిక, ఉన్న వారిలో మరికొందరు ఇతర పార్టీల వైపు తొంగి చూడకుండానే మళ్లీ ఇంటింటికి నినాదమన్న వ్యాఖ్యలు పార్టీలో వినిపిస్తున్నాయి.



న్యాయం చేయాలంటూ రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న తోకతిప్ప గ్రామస్థులు

రూ.ఐదు కోట్లకు టోపీ!

తోకతిప్పలో చిట్టీల వ్యాపారి పరారీ

» పేదలను నట్టేట ముంచిన వైనం

» పోలీసులకు బాధితుల ఫిర్యాదు

భీమవరం క్రైం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): తమ సామాజిక వర్గానికి చెందినవాడు, గ్రామంలో ఇల్లు ఉందని నమ్మి రూ.లక్షల్లో చీటీలు కట్టారు. కాయాకష్టం చేసి రాత్రనక, పగలనక కష్టపడి రూపాయి రూపాయి కూడబెట్టి నెలకు రూ.5 వేలు, రూ.10 వేలు అతనికి జమ చేసేవారు. చీటీ మధ్యలో పాడుకుంటే చాలా నష్టం వస్తుందని అతను చెప్పిన మాయ మాటలను నమ్మి చీటీలు పాడకుండా చివరి వరకు ఉంచారు. తీరా చూస్తే మొత్తం కట్టిన సొమ్ముతో ఆ వ్యక్తి రాత్రికి రాత్రే కుటుంబంతో సహా ఉడాయించాడు. ఈ సంఘటన భీమవరం మండలం తోకతిప్పలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన పొన్నాల వీరవెంకట రమణ అనే వ్యక్తి 12 ఏళ్లగా చిట్టీల వ్యాపారం చేస్తున్నాడు. దీంతో గ్రామస్థులంతా అతనిని నమ్మారు. కొన్నిసార్లు చిట్టీలు పాడుకుంటే నెల రోజుల్లో డబ్బులు సరిపెట్టేసేవాడు. అలా అందరికి నమ్మకస్తుడైపోయాడు. గ్రామస్థులే కాకుండా దూరప్రాంతాల్లోని వారి బంధువుల చేత కూడా చిట్టీలు వేయించారు. విశేషమేమిటంటే చిట్టీలు కట్టిన వారందరూ నిరుపేదలు. కనీసం కొందరికి ఇల్లు కూడా లేదు. ఆరు నెలల నుంచి గ్రామస్థులు కొంత మంది తాము కట్టిన చీటీ అయిపోయిందని, డబ్బులు ఇవ్వమని కోరడంతో నేను ఎక్కడికి వెళతాను, ఊరిలో మనిషినే కదా. ఇస్తానులే.. కంగారు పడకండి అంటూ నమ్మించాడు. అయితే నెల రోజుల క్రితం రాత్రికి రాత్రే భార్య, కుమారుడు, కుమార్తెను తీసుకుని పరారయ్యాడు. ఎన్ని రోజులైనా వీర వెంకట రమణ గ్రామానికి రాకపోవడంతో గ్రామస్థులు ఆరా తీశారు. సామాన్లతో సహా వెళ్లిపోయినట్టు తెలిసి లబోదిబోమన్నారు. వారితోపాటుగా కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలంలో కొన్ని గ్రామాలు, మొగల్తూరు, నరసాపురం మండలాల్లోని కొన్ని గ్రామాలకు చెందినవారు చిట్టీలు వేశారు. సుమారు రూ.ఐదు కోట్లు వరకు సొమ్ములు రావాలని బాధితులు చెబుతున్నారు. ఇటీవల వీర వెంకట రమణ ఒక రొయ్యల షెడ్డులో పని చేస్తున్నాడని తెలుసుకుని గ్రామస్థులంతా అక్కడికి వెళ్లగా అక్కడి నుంచి ఉడాయించాడు. ఇక అక్కడి నుంచి అతని ఆచూకీ లేదు. బాధితులంతా శనివారం భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని కొంతసేపు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రూరల్ ఎస్ఐ ఐ.వీర్రాజుకు ఫిర్యాదును అందించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై ఎస్ఐ మాట్లాడుతూ పైఅధికారులతో మాట్లాడి చట్టరీత్యా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎవరికి ఎంత సొమ్ములు ఇవ్వాలో ఒక పత్రంపై రాసి ఇవ్వాలని సూచించారు.



రూరల్ ఎస్ఐ వీర్రాజుకు ఫిర్యాదు అందజేస్తున్న తోకతిప్ప గ్రామస్థులు

సచివాలయ ఉద్యోగులకు బదిలీ కౌన్సెలింగ్



హాజరైన ఉద్యోగులు

» ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రాతిపదికన..

» ఏలూరులో అగ్రికల్చరల్ అసిస్టెంట్, సర్వేయర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు నిర్వహణ

» పంచాయతీ శాఖకు ఎవరి జిల్లాలో వారికే..

ఏలూరు సిటీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి):గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీ కౌన్సెలింగ్‌లో భాగంగా పంచాయతీ శాఖ గ్రేడ్-5, గ్రేడ్-6 కార్యదర్శులకు ఆప్షన్ల ప్రక్రియ పూర్తయింది. పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి ఉమ్మడి పశ్చిమలోని ఏ జిల్లాకు ఆ జిల్లాలోని డీపీవోలు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏలూరు జిల్లాలో శుక్రవారం కౌన్సెలింగ్ పూర్తి కాగా తూర్పు, పశ్చిమలో శనివారం పూర్తిచేశారు. మిగిలిన విభాగాలకు శనివారం ఏలూరులోనే ఉమ్మడి జిల్లా ఉద్యోగుల బదిలీ కౌన్సెలింగ్ జరిగింది. మూడు జిల్లాల ఉద్యోగులు హాజయ్యారు. పంచాయతీ శాఖలో వేరే జిల్లాకు బదిలీ కోరుకునే ఉద్యోగులు తాము కోరుకున్న జిల్లాతో పాటు, ప్రస్తుతం పనిచేస్తున్న జిల్లా కౌన్సెలింగ్‌కు వెళ్లాల్సి రావడంతో గందరగోళంగా నెలకొంది.

• వ్యవసాయ శాఖ అసిస్టెంట్లకు

ఉమ్మడి పశ్చిమ వ్యవసాయ శాఖ అసిస్టెంట్లకు ఏలూరు జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో జేడీ షేక్ హబీబ్‌బాషా బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. పశ్చిమ జేడీ వెంకటేశ్వరరావు, తూర్పుగోదావరి తరపున కొవ్వూరు వ్యవసాయశాఖ ఏడీ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఐదేళ్ల సీనియార్టీ, రిక్వెస్ట్‌లకు సంబంధించి కౌన్సెలింగ్‌కు 456 మంది హాజరయ్యారు. వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు ఉదయం 8 గంటలకే కార్యాలయానికి చేరుకుని తాము ఏ ప్రాంతానికి బదిలీ కావాలో ఆప్షన్ ఫారంలో పొందుపరిచారు. దీనిని పరిశీలించి 30వ తేదీలోగా బదిలీ ప్రక్రియ పూర్తి చేస్తారు.

• ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు..

ఉమ్మడి పశ్చిమ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఏలూరు ఎస్ఈ కార్యాలయంలో బదిలీ కౌన్సెలింగ్ జరిగింది. 538 మందిని బదిలీ చేయాల్సి వున్నట్టు ఎస్ఈ రమణమూర్తి తెలిపారు. రెండు రోజులపాటు ఈ కౌన్సెలింగ్ జరుగుతుందని, తొలిరోజు 300 మందికి, మిగిలిన వారికి ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జేడీ షేక్ హబీబ్‌బాషా

• సర్వేయర్లకు..

ఉమ్మడి పశ్చిమ సర్వేయర్ అసిస్టెంట్లకు ఏలూరు జిల్లా సర్వేయర్ శాఖ ఏడీ కార్యాలయంలో కౌన్సిలింగ్ జరిగింది. 186 మందికి బదిలీ ప్రక్రియ కొనసాగింది.

• వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లకు

ఉమ్మడి పశ్చిమ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లకు ఏలూరు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కార్యాలయంలో ఆదివారం బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

• ఉమ్మడి పశ్చిమలో 6,000..

ఉమ్మడి పశ్చిమలో 1123 గ్రామ/వార్డు సచివాలయాలు ఉండగా ఇందులో 9,555 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో బదిలీ ప్రక్రియలో ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం బదిలీ చేయాల్సిన ఉద్యోగులు ఆరు వేల మంది వరకు ఉంటారని అంచనా వేస్తున్నారు.

వార్డు సచివాలయాల సిబ్బందికి..

ఏలూరు టూ టౌన్ : ఉమ్మడి పశ్చిమ పరిధిలోని ఏలూరు నగర పాలక సంస్థ, ఎనిమిది మున్సిపాల్టీల పరిధిలోని వార్డు సచివాలయ సిబ్బందికి బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించినట్లు నగర పాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు. మొత్తం 1,362 మంది వార్డు సచివాలయ సిబ్బందిలో ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వారిని బదిలీ చేస్తున్నట్టు తెలిపారు. బదిలీకి

(మిగతా 8వ పేజీలో)


ఈవీఎం గొడౌన్ తనిఖీ చేసిన కలెక్టర్ వెట్రిసెల్వి



ఏలూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ప్రాంగణంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు(ఈవీఎం) గొడౌన్‌ను కలెక్టర్ కెవ వెట్రిసెల్వి, వివిధ రాజకీయ పక్షాల నేతల ఆధ్వర్యంలో శనివారం తనిఖీ చేశారు. ఈవీఎంల గొడౌన్ వద్ద సీసీ కెమెరాలతో చేసిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించి రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఎప్పటికప్పుడు ఈవీఎం గొడౌన్ తనిఖీ చేసి ఎన్నికల సంఘానికి నివేదికలు పంపిస్తున్నామని ఆమె వివరించారు. డీఆర్వో విశ్వేశ్వరరావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ చెల్లన్నదొర, రాజకీయ పార్టీల నేతలు యు.బాలానందం, అచ్యుత్, ఎ.రతన్‌కాంత్, నెరుసు నెలరాజు, పి.ఆదిశేషు, ఎస్.బాబూప్రసాద్, స్టాన్లీబాబు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఇలాంటి రికార్డు రూమ్‌ను ఎక్కడా చూడలేదు..

జేసీ ధాత్రిరెడ్డి అసహనం..



సెల్‌ఫోన్ టార్చ్ వెలుగులో రికార్డు రూమ్‌ను పరిశీలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి, ఆర్డీవో అంబరీష్

పెదవేగి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో ఎక్కడా ఇలా ఉన్న రికార్డు రూమ్‌ను చూడలేదు. రికార్డులను అత్యంత జాగ్రత్తగా భద్రపర్చాల్సి ఉండగా, ఇలా చిందర వందరగా పెట్టడమేమిటీ.. ఇలా ఉంటే రికార్డులకు భద్రత ఎలా ఉంటుంది, అంశాల వారీగా రికార్డులను ఉంచాలని చెప్పినా చేయకపోతే ఎలా...? రికార్డు రూమ్‌ను ప్రక్షాళన చేయండి' .. అంటూ జేసీ ధాత్రిరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. పెదవేగి తహసీల్దారు కార్యాలయాన్ని ఆర్డీవో అంబరీష్‌తో కలిసి శనివారం సాయంత్రం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. రికార్డు రూమ్‌లోకి వెళ్లిన ఆమె ఆ గదిలో లైటు కూడా లేకపోవడంతో సెల్‌ఫోన్ లైటు వెలుగులో రికార్డు రూమ్‌ను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. రెవెన్యూ రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. అనంతరం పెదవేగి, కవ్వగుంట గ్రామాల్లో రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. డీఎస్‌వో ఇ.బాబూ విలియమ్స్, తహసీల్దారు ఎస్జీ.భ్రమరాంబ, ఆర్ఐ కేవీవీ.సారథి పాల్గొన్నారు.

మోడల్ ప్రైమరీలో 60 మంది విద్యార్థులు

ముదినేపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నూతన బడుల వ్యవస్థలో ఏర్పాటైన మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 60 ఖచ్చితంగా ఉండాల్సిందేనని జిల్లా విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు అన్ని మోడల్ ప్రైమరీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శనివారం ఆదేశాలు అందాయి. ఈ పాఠశాలల్లో 60 మంది విద్యార్థుల కంటే తక్కువగా ఉంటే మోడల్ ప్రైమరీ నుంచి ప్రైమరీ పాఠశాలగా డీగ్రేడ్ చేస్తామని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. కలెక్టర్ జారీ చేసిన ఆదేశాల మేరకు 60 కంటే తక్కువ విద్యార్థులున్న మోడల్ ప్రైమరీ పాఠశాలల హెచ్‌ఎంలు ఎస్ఎంసీ సమావేశాలు నిర్వహించి విద్యార్థుల నమోదును వెంటనే పెంచాలని పేర్కొన్నారు.

30 లోపు నమోదైన విద్యార్థులకే..

ఈనెల 30లోగా పాఠశాలల్లో నమోదైన విద్యార్థులకే తల్లికి వందనం సొమ్ము ఖాతాల్లో జమ అవుతుందని పాఠశాలల విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు ఆదేశాలు జారీ చేశారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు 30లోపు విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పూర్తి చేయాలని పేర్కొన్నారు.

ముంచేసిన ఫంగస్!

» కిలో చేపలు 85 నుంచి 80కు తగ్గిన ధర

» ఎకరానికి రూ.రెండు లక్షల నష్టం

» పెరిగిన మేత ధరలు.. నష్టాల్లో రైతులు

నాలుగు నెలల క్రితం కిలో రూ.90 నుంచి రూ.100 వరకు వున్న ఫంగస్ చేప ధర.. ప్రస్తుతం రూ.80కు చేరింది. ధర బాగుందని సాగు వైపు మొగ్గు చూపిన రైతులు.. పెట్టుబడి భారమని భావించి ఇప్పుడు సైజు లేకపోయినా చేపలను పట్టేస్తున్నారు. దీంతో టన్నుకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు నష్టం వస్తుందని గగ్గోలు పెడుతున్నారు.

ఆకివీడు రూరల్/ముదినేపల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి):ఆక్వా కల్చర్‌లో ఫంగస్ సాగు నష్టాలను మిగులుస్తోంది. మార్కెట్‌లో ధరలు పడిపోవడం, మేతల ధరలు పెరిగిన నేపథ్యంలో వీటికి గిట్టుబాటు ధర లభించక.. కనీసం పెట్టుబడి కూడా దక్కించుకోలేక నష్టపోతున్నారు. ఫంగస్ చేప ధర కిలోకు 85 నుంచి 80 రూపాయలకు తగ్గింది. ఫంగస్‌ను పెంచే రైతులు పావు కేజీ సైజు చేపలను వినియోగించి ఆరు నెలల పాటు పెంచుతారు. అదే చిన్న సైజు పిల్లలైతే ఏడాది పాటు సాగు చేయాలి. సీడ్ స్థానికంగానే లభిస్తుంది. సీడ్ ధర కిలోకు 2,000 పిల్లలైతే ఒక్కోటి 0.80 పైసలకు, 2,500 పిల్లలైతే ఒక్కోటి రూ.0.70 పైసలకు లభిస్తున్నది.

ఆహారం.. పెరిగిన ఖర్చులు

చేపలకు ఆహారంగా పిల్లెట్లు ఉపయోగిస్తారు. దీని ధర కిలో రూ.32. సీడ్‌లో నాణ్యత లేకపోవడంతో చేప పెరుగుదల తక్కువగా ఉంది. ప్రస్తుతం చేప కిలోకు పెరగాలంటే రెండు కిలోల మేత పెట్టాలి. మేతల ధరలు పెరిగాయి. కేజీ రూ.28 నుంచి రూ.35కు చేరింది. వీటితోపాటు చెరువు లీజు, విద్యుత్ చార్జీ, మనుషులు, మందులు, ట్రాన్స్‌పోర్టు ఖర్చులు కలిపి మొత్తం కిలోకు రూ.75 నుంచి 78 రూపాయల వరకు అవుతుంది. పెట్టుబడి అప్పుకు వడ్డీ అదనం. ప్రస్తుతం మార్కెట్ ధర రూ.85 నుంచి రూ.5 తగ్గి రూ.80కు

(మిగతా 8వ పేజీలో)



ఫంగస్ చేపలు

కనుమరుగవుతున్న ఎడ్ల బండ్లు


మర్లపాలెంలో ఎడ్లబండి

చాట్రాయి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సైసై జోడెడ్ల బండి.. షోకైన దొరల బండి, ఇప్పుడు కనుమరుగుకు అతి చేరువలో ఉంది. ఆ నాడు గ్రామాల్లో ప్రతి ఇంటికి ఎడ్లబండి ఉండేది. అప్పట్లో మంచి ఎడ్లజత బండి ఉండడం సామాజిక హోదాగా రైతు కుటంబాలు భావించేవారు. ప్రతి ఇంటికి ఎడ్లబండి ఉండేది. రైతు కుటుంబాలు ఎద్దులను కన్నబిడ్డల్లా, బండిని జాగ్రత్తగా చూసుకునేవారు. పల్లెటూరులలో ఎడ్లబండిపై వెళుతూ మంచి అనుభూతిని పొందేవారు. పూర్వకాలంలో సేద్యం మొదలైన దగ్గర నుంచి రైతులకు చేదోడుగా ఉన్న ఎడ్లబండ్లు యాంత్రిక విప్లవంతో కనుమరుగుకు దగ్గరలో ఉండడం బాధించే విషయమని వృద్ధ రైతులు ఆవేదన చెందుతున్నారు.

- నాడు పల్లెటూరులో ప్రతి ఇంటా దర్శనం
- వ్యవసాయ యాంత్రీకరణతో వినియోగించేవారు కరువు
- భారమైన పశుపోషణతో స్వస్తి చెప్పిన అన్నదాతలు

పశువుల ఎరువు పొలాలకు తరలించడం, ఎరువులు వ్యవసాయ పనిముట్లు సాగు భూముల్లోకి తీసుకువెళ్లడానికి, పంటలు, వరిగడ్డి ఇళ్లకు తెచ్చుకోవడానికి తదితర పనులకుఉపయోగించేవారు. అసలు ఎడ్లబండి లేకుండా వ్యవసాయం నడిచేది కాదు.

ప్రత్యేక ఆకర్షణగా ఎడ్లబండ్లు

పెళ్లిళ్లకు, తీర్థయాత్రలకు ఎడ్లబండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేవి. వీధిలో ఒక ఇంట్లో పెళ్లి అయితే ఆ వీధిలో ఉండే ఎడ్లబండ్లు అన్నీ కట్టి కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందించేవారు. వ్యవసాయంలోకి ట్రాక్టర్లు రంగప్రవేశం తరువాత ఎడ్లబండ్లు వాడకం క్రమంగా తగ్గుతూ వచ్చి ఇప్పుడు పూర్తిగా కనుమరుగు అవుతున్నాయి. 25 ఏళ్ల క్రితం వరకు గ్రామాల్లో భూస్వాములకు, పెద్ద రైతులకు మాత్రమే ట్రాక్టర్లు ఉండేవి. చిన్న రైతులు ఎడ్ల బండితోనే వ్యవసాయం చేసుకునేవారు.

యాంత్రీకరణతో పెరిగిన ట్రాక్టర్లు

వ్యవసాయ యాంత్రీకరణకు ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వడంతో గ్రామాల్లో వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, బ్యాంకులు ఐదు ఎకరాలు భూమి ఉన్న రైతులకు కూడా ట్రాక్టర్లు కొనుగోలుకు రుణాలు ఇవ్వడంతో అన్ని ఊర్లలో ట్రాక్టర్ల సంఖ్య బాగా పెరిగింది. వ్యవసాయ పనులు అన్నిటికి కిరాయి ట్రాక్టర్లు అందుబాటులోకి వచ్చాయి. స్థానికేతరులైన ధనవంతులు గ్రామాల్లో వందల ఎకరాలు భూములు కొనుగోలు చేస్తుండడం వల్ల భూముల ధరలు పెరిగి పచ్చిక బీళ్లు కరువయ్యాయి. పశువులు తిరగడానికి చోటు లేకపోవడం, పశుగ్రాసం, కూలీల కొరత తదితర కారణాల వల్ల రైతులకు పశుపోషణ భారమైంది. దాదాపు రైతులందరూ పశువులను అమ్మి వ్యవసాయ పనులన్నీ సొంత, కిరాయి ట్రాక్టర్లతో చేయించుకుంటున్నారు. ప్రస్తుతం చాట్రాయి మండలంలోని 18 గ్రామాల్లో 10 ఎడ్లబండ్లు మాత్రమే మిగిలి ఉండడంపై ఈ పరిస్థితికి అద్దం పడుతుంది. కొన్ని వందల తరాల మానవ జీవనస్రవంతిలో భాగమైన ఎడ్లబండ్లు కనుమరుగు కావడం పట్ల పలువురు ఆవేదన చెందుతున్నారు.

ఒక్కసారైనా తినాల్సిందే



ఆషాఢంలో మునగాకు.. తెలగపిండి కూర విశిష్టత

వర్షాకాలంలో వచ్చే కొన్ని వ్యాధులను అరికట్టవచ్చని పెద్దల సూచన

పాలకొల్లు అర్బన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): వర్షకాలం అరంభంతో పాటు ప్రవేశించే ఆషాఢ మాసంలో కొన్ని ఆచారాలను పాటించడం భారతీయుల ఆచారం. ఇది కొంతమంది చాదస్తమంటూ కొట్టి పారవేస్తారు. ఎప్పుడో పాతకాలం నాటి పద్ధతులుగా భావిస్తారు. అయితే ఆషాఢంలో పాటించాల్సిన విషయాలను పెద్దలు చెప్పేవాటి వెనక ఓ ఆరోగ్యకరమైన కారణం కనిపిస్తుంది. దానిలో ప్రధానమైనది మునగాకు, తెలగ పిండి కూర. సాధారణంగా ఈ కూరను మిగిలిన సమయాల్లో ఎవరూ పెద్దగా తినరు. అందువల్ల ఈ కూర వంటింటికి దూరంగా ఉంటుంది. ఆషాఢంలో మాత్రం కష్టమైనా ఒక్కసారైనా దీనిని తింటారు. ఈ కూర తినడం వల్ల వేసవి వెళ్లి వర్షాకాలం వచ్చే కొన్నిరకాల వ్యాధులను దూరం పెట్టవచ్చని పెద్దలు చెబుతారు. అజీర్తి, విరేచనాలు, జలుబు, దగ్గు తగ్గించడమే కాకుండా దీనిలో ఉన్న కాల్షియం వల్ల కీళ్ల నొప్పులు కూడా తగ్గుతాయి. విటమిన్-ఎ వల్ల కంటిలో ఏర్పడే దోషాలు నివృత్తి అవుతాయి. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. బరువు తగ్గడం, శరీరంపై వచ్చే పొక్కులు వంటివి నివారణకు మునగాకు, తెలగపిండి కూర బాగా పనిచేస్తుంది. అందువల్ల మన పెద్దలు ఆషాఢంలో మునగాకు, తెలగ పిండికూర ఆది, మంగళవారాల్లో ఒక్కసారైనా తప్పనిసరిగా తినడం సెంటిమెంట్‌గా భావిస్తారు.

ఆషాఢంలో తప్పనిసరిగా తినాలి



ఆసాఢం మాసం వచ్చిందంటే చిన్నతనం నుంచి మా ఇంటిలో మునగాకు తెలగపిండి కూర మా పెద్దలు చేసిన విధంగా నేను వండుతాను, ఈ కూర వల్ల చాలాఆరోగ్యం.. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తీసుకుని వర్షాకాలంలో వచ్చే ఎన్నోరకాల వ్యాధుల నుంచి రక్షణ పొందాలని కోరుతున్నా. నా వీలును బట్టి తెలిసిన వారికి ఈ కూర వండి అందజేస్తుంటాను.

- తోలేటి విజయగాయత్రి, గృహిణి, పాలకొల్లు

మునగాకు-తెలగపిండి కూర వండే విధానం ఇలా..

ఇంటిలో ఆరుగురు కుటుంబ సభ్యులు ఉంటే మూడు కప్పుల వరకు మునగాకు తీసుకుని, శుభ్రపరిచి, దానికి సగం అంటే ఒకటిన్న కప్పుల తెలగపిండి తీసుకోవాలి. ముందుగా తెలగ పిండిని నీటిలో మరగనిచ్చి పక్కన పెట్టుకోవాలి. తరువాత తెలగ పిండిని తీసుకుని మూకుడు (బాణీలో) కొద్దిగా నూనె వేసి, కొద్దిగా నీరు పోసి తెలగ పిండిని కలపాలి, అనంతరం వేరుశెనగ గుళ్లు, పచ్చిమిర్చి, కరివేపాకు, ఆవాలు, నాలుగైదు వెల్లుల్లి రెబ్బలు, జీలకర్ర, మినపప్పు తగినంతగా వేసుకుని మరగనిచ్చిన తరువాత సరిపడా ఉప్పును వేసుకోవాలి. ఈవిధంగా మునగాకు తెలగ పిండి కూర రెడీ.

ఐడియా అదిరింది..

ఎండ, వానకు రక్షణగా బైక్ అంబరిల్లా..


బైక్ అంబరిల్లాలో వెళుతున్న గంధం శ్రీనివాసరావు

పాలకొల్లు అర్బన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఎండాకాలమైనా.. వర్షాకాలమైనా బైక్‌లపై ప్రయాణించే వారు అవస్థలు పడతారు. అధునిక పరిజ్ఞానంతో బైక్‌లపై వెళ్లేవారు కూడా ఎండ తగలకుండా, వర్షానికి తడవకుండా ప్రయాణించే విధంగా బైక్ అంబరిల్లా పనిచేస్తోంది. పోడూరు మండలం వేడంగి గ్రామానికి చెందిన గంధం శ్రీనివాసరావు అనే టైల్స్ మేస్త్రీ తన బైక్‌కు బైక్ అంబరిల్లా అమర్చుకుని వెళుతూ శనివారం సంత మార్కెట్‌లో కనిపించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓకినోవా ఎలక్ట్రానిక్ ఓకినోవా (మోడల్) బండికి 15 రోజుల క్రితం రూ.3,500లకు ఈ బైక్ అంబరిల్లాను హైదరాబాద్‌లో కొనుగోలు చేసి తీసుకువచ్చానన్నారు. ఎంత ఎండ కాసినా బాగుందని, వర్షం వస్తే చుట్టూ వేరే విధంగా కప్పుకునేందుకు ఏర్పాట్లు ఉన్నట్టు తెలిపారు. ఎక్కువ గాలి వీస్తే ఆగిపోవలసి ఉంటుందని, సుమారుగా 40 కిలో మీటర్ల వేగంతో వెళుతున్నా ఇబ్బందులు ఉండడం లేదన్నారు. ఈ బైక్‌ను మార్కెట్‌లో వ్యాపారులు, వినియోగదారులు ఆశ్చర్యంగా చూశారు. ఈ బైక్ అంబరిల్లా ఆన్‌లైన్‌లో కూడా బుక్ చేసుకోవచ్చని తెలిపారు.


మాట్లాడుతున్న కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ అధికారి రిషబ్ చతుర్వేది

గిరిజనులకు పథకాలు అందించే బాధ్యత అధికారులదే

బుట్టాయగూడెం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు గిరిజనులందరికి అందించే బాధ్యత అధికారులదేనని కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ ప్రాజెక్టు అధికారి రిషబ్ చతుర్వేది అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు ఈనెల 15 నుంచి 30వ తేదీ వరకు జరుగుతున్న 'దార్తి అభ జనజాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్' అవగాహన గ్రామసభలు బుట్టాయగూడెం మండలం ముంజులూరు, పోలవరం మండలం చింతపల్లి, కల్లుమామిడిలో జరగ్గా ఆయన పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరును గిరిజన లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. జన్మన్ అభియాన్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి గర్భిణీలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. అనంతరం కెఆర్ పురం ఐటిడిఎ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో పిఎం జన్మన్ పథకంపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమాల్లో పివో కె.రాములు నాయక్, ఆర్డీవో ఎంవీ రమణ, ఐసీడీఎస్ పీడీ పి.శారద, పలు శాఖల అధికారులు, సిబ్బంది ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




ఏలూరు రామచంద్రరావుపేటలో రథం లాగుతున్న భక్తులు.. జగన్నాథస్వామి దారు విగ్రహాలు.. పూజలు చేస్తున్న ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి దంపతులు

వైభవంగా జగన్నాథుని రథయాత్ర

ఏలూరు కార్పొరేషన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): హరేకృష్ణ గోకులక్షేత్రం ఆధ్వర్యంలో శనివారం ఏలూరు నగరంలో జగన్నాథస్వామి రథయాత్ర వైభవంగా నిర్వహించారు. ఏలూరు రామచంద్రరావుపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ జగన్నాథ రథయాత్ర నగరంలో నిర్వహించడం వల్ల ఇక్కడ ప్రజలకు అంతే శుభమే జరుగుతుందన్నారు. రథయాత్రలో ఎమ్మెల్యే చంటి దంపతులు పూజలు చేసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన కళాభూమి కూచిపూడి కళాకారులు వై.సతీష్‌కుమార్, నాగలక్ష్మి శిష్యబృందం నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రథం వద్ద వంశీధర్ స్వామిజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా ప్రతినిధులు కోలాటం ప్రదర్శనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు రథయాత్రలో పాల్గొనడం విశేషం. హరేకృష్ణ గోకులక్షేత్రం నిర్వాహకులు వంశీధర్ స్వామిజీ, సిబ్బంది పాల్గొన్నారు. వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులు దాదాపు రెండు వేల అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఉషాబాల సంస్థల అధినేత వీవీ బాలకృష్ణారావు, ఏలూరు ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, కార్పొరేషన్ కో-ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, ఆర్ఆర్‌పేట దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మన్ పాలడగుల రమాదేవిప్రసాద్ దంపతులు, ఈవో నల్లూరి సతీష్‌కుమార్, ప్రధాన అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాసరామానుజాచార్యులు, డాక్టర్ ఎంఎల్‌వీ ప్రసాద్, ఆర్‌కే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సాంస్కృతిక ప్రదర్శన


మహిళల కోలాటం





శ్రీవారి దర్శనానికి వేచి వున్న భక్తులు (ఇన్‌సెట్‌లో) కూర్మావతారంగా దర్శనమిస్తున్న జగన్నాథుడు

మార్మోగిన గోవింద నామస్మరణ

ద్వారకాతిరుమల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గోవిందనామ స్మరణతో ద్వారకాతిరుమల క్షేత్రం మార్మోగింది. త్రయోదశి మంచి తిది కావడంతోపాటు శనివారం స్వామికి ఇష్టమైన రోజు కావడంతో ఆలయానికి భక్తుల రాకతో కళకళలాడింది. ఆషాడమైనా ఆలయానికి దాదాపు 20వేల మంది వరకు భక్తులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించినట్టు ఆలయవర్గాలు భావిస్తున్నాయి. ఆలయానికి వచ్చిన పలువురు భక్తులు తొలుత కేశ ఖండనశాలలో మొక్కుబడులు తీర్చుకున్నారు. దర్శనానంతరం వారంతా స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు. శ్రీవారి సాధారణ దర్శనానికి మూడు గంటలపైబడి సమయం పట్టింది.

కూర్మావతారంలో జగన్నాథుడు

కూర్మావతారంలో జగన్నాథస్వామి వారు శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. లక్ష్మీపురం గ్రామంలోని శ్రీవారి ఆలయానికి దత్తత ఆలయంలో వచ్చేనెల 6 వరకు జరుగునున్న జగన్నాథ రథోత్సవాలను పురస్క రించుకుని స్వామివారు రోజుకో అలంకారంలో భక్తజనులను కటాక్షిస్తున్నారు. దీనిలో భాగంగా కూర్మరూపంలో శంఖు, చక్రాలను ధరించి అభయహస్తాన్ని ప్రసాదిస్తున్న అలంకరణలో ఉన్న జగన్నాథుని దారు విగ్రహాలను పలువురు భక్తులు దర్శించుకున్నారు.


భీమవరం పద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సహస్రదీపాలంకరణ

వేంకటేశ్వరస్వామికి సహస్ర దీపాలంకరణ

భీమవరంటౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి) : భీమవరంలో జువ్వలపాలెం రోడ్డులోని పద్మావతి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆషాడ మాసం మొదటి శనివారం పురస్కరించుకుని స్వామి, అమ్మవారికి ఉంజల్ సేవ, సహస్రదీపాలంకరణ నిర్వహించారు. ఆలయ అర్చకుడు వాడపల్లి ఆదినారాయణాచార్యులు ఆధ్వర్యంలో వెంకట సత్యదుర్గ నాగ సోమరాజు దంపతులచే విశేష పూజలు చేసిన అనంతరం ఊంజల్‌సేవ, సహస్రదీపాలంకరణ పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణరాజు పర్యవేక్షించారు.

సంప్రదాయబద్ధంగా గిరిజనుల పండుగ

చాట్రాయి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పోతనపల్లి గ్రామంలో గిరిజనులు (లంబాడీలు) శీతల పండుగను సంప్రదాయ బద్ధంగా జరుపుకున్నారు. గ్రామంలోని గిరిజనులు అందరూ ఊరి పొలిమేరలో ఉన్న ముత్యాలమ్మ చెట్టు వద్దకు వెళ్లి అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా ఈ పండుగను జరుపుకోవడం గిరిజనుల ఆనవాయితీ. వర్షాలు సకాలంలో కురిసి పంటలు సమృద్ధిగా పండి సుభిక్షంగా ఉండాలని ఈ పండుగ జరుపుకుంటారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, కుల పెద్దలు ధారావత్ పేరయ్య, భాస్కరరావు, బాణావతు పాంచాలి, ధారావత్ మల్లికార్జునరావు, మంగయ్య తదితరులు పాల్గొన్నారు.


గ్రామ దేవతకు పూజలు చేస్తున్న గిరిజనులు

పండుగలా మెగా పీటీఎం 2.0

జూలైలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో నిర్వహణకు ఏర్పాట్లు

ఏలూరు అర్బన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : పిల్లల విద్యావికాసం, వారి అభివృద్ధి ప్రధానాంశాలుగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వచ్చే నెలలో మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ (తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం-పీటీఎం 2.0)ను నిర్వహించడానికి విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. వాస్తవానికి ఈ సమావేశాన్ని జూలై 5న నిర్వహించాలని తొలుత నిర్ణయించినా ఆ రోజున మొహర్రం ఐచ్ఛిక సెలవు కావడంతో మరో రెండు, మూడు రోజుల వ్యవధిలో మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌ను జరపడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో మెగా పీటీఏ 2.0ని జూలై 10న నిర్వహించాలని ఇంటర్‌బోర్డు నిర్ణయించింది. ఇదే తేదీని పాఠశాలవిద్యాశాఖ కూడా ఖరారు చేసే అవకాశం ఉంది. గతేడాది డిసెంబరు 7న నిర్వహించిన పీటీఎంకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 45 వేల పాఠశాలల్లో 25.46 లక్షల మంది తల్లిదండ్రులు పాల్గొనగా, ఈ ఏడాది నిర్వహించనున్న మెగా పీటీఎం 2.0కి అన్ని ప్రైవేటు పాఠశాలలను చేర్చడంతో రెట్టింపు హాజరు ఉంటుందని అంచనా. దీనికనుగుణంగానే మెగా పీటీఎం 2.0ని విజయవంతం చేయడం ద్వారా పాఠశాల నిర్వహణ, విద్యార్థి ప్రవర్తన, సామాజిక అంశాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానిక విద్యావేత్తలు, మేధావులు, సంఘ సేవకులను సమన్వయం చేసుకుని సత్ఫలితాలు సాధించాలని విద్యాశాఖ భావిస్తోంది.

మినిట్ టు మినిట్ ప్రోగ్రాం ఇలా..

ఏలూరు జిల్లాలోని 1,609 ప్రభుత్వ, 1,200 ప్రైవేటు పాఠశాలలన్నింటిలో మెగా పీటీఎం 2.0 నిర్వహణకు మార్గదర్శకాలను జారీ చేశారు. వీటితోపాటు 237 జూనియర్ కళాశాలల్లో ఈ సమావేశాలు నిర్వహిస్తారు. మొత్తంమీద ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో సుమారు 2.60 లక్షల మంది విద్యార్థులు చదువుతుండగా, పశ్చిమ గోదావరి జిల్లాలో 1.392 ప్రభుత్వ, 375 ప్రైవేటు పాఠశాలలన్నింటిలో, 130 జూనియర్ కళాశాలల్లో ఈ సమావేశాలు నిర్వహి స్తారు. 2.69 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆ మేరకు మెగా తల్లిదండ్రులు, టీచర్ల సమావేశంలో పాల్గొనాల్సి ఉంటుంది. ఉదయం 9నుంచి 9.30 గంటల వరకు తల్లిదండ్రులు, విద్యావేత్తలు, పూర్వపు విద్యార్థులు, ఎస్ఎంసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, విద్యాశాఖాధికారులకు ఆహ్వానం పలుకుతూ ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. హాజరైన వారందరితో కలిపి ఒక్కో విద్యార్థి, పేరెంట్స్‌తో విడివిడిగా ఫొటోలు తీసే కార్యక్రమం, తరగతి గదిలోకి పేరెంట్స్‌ను ఆహ్వానించి వారిని పిల్లలతో కూర్చోబెడతారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు ఒక్కో విద్యార్థి, వారి తల్లిదండ్రులతో క్లాసు టీచరు సమావేశమై హోలిస్టిక్ ప్రోగ్రెస్ రిపోర్టు అందజేయడం, వారి ప్రగతి, ఆరోగ్యవిషయాలపై చర్చించారు. తల్లికి వందనం, గుడ్ టచ్- బ్యాడ్ టచ్, పాజిటివ్ పేరెంటింగ్, మనబడి మ్యాగజైన్‌ల గురించి అవగాహనకు క్లాసురూమ్‌లోని టీవీ/ఐఎఫ్‌పీలలో లఘుచిత్రాలను ప్రదర్శిస్తారు. ఉదయం 10.30 నుంచి 20 నిమిషాలపాటు తల్లులకు రంగోలి, మ్యూజికల్ ఛైర్, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహిస్తారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.35 గంటల వరకు ప్రధాన వేదికపైకి అందరినీ ఆహ్వానించి స్వాగతగేయాలాపన తర్వాత తల్లులను వేదికపైకి పిలిచి, వారి పిల్లలు పుష్పాలతో పాదాభివందం చేసేందుకు తల్లికి వందనం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. స్కూలు టాపర్లు ఇద్దరితో ప్రసంగాలు, పూర్వపు విద్యార్థులతో ఉపన్యాసాలు, ముఖ్యఅతిథి ప్రసంగం ఉంటాయి. చివరిగా ప్రతిజ్ఞతో కార్యక్రమాన్ని ముగించి, అందరూ సహపంక్తి భోజనం చేస్తారు.

పండుగ వాతావరణంలో పీటీఎం

పీటీఎంలో భాగంగా విద్యార్థికి సంబంధించిన విద్యాప్రగతి, సామర్థ్యాలను తెలిపే హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు టీచర్లు అందజేసి, ఏయే విషయాల్లో వెనుకబాటు ఉందో గుర్తించి, వాటిని అధిగమించడానికి ఎలా ప్రోత్సహించాలో సూచనలు చేస్తారు. స్కూలు హెచ్‌ఎం నేతృత్వంలో విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించి పాఠశాలలో విద్యాసంబంధిత ప్రగతి, మౌలిక సదుపాయాల ఆవశ్యకత, కార్యాచరణ ప్రణాళికలను తల్లిదండ్రులకు వివరిస్తారు. పేరెంట్స్‌కు ఆటపాటలతో కూడిన వినోదాత్మక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. విద్యార్థులందరికీ రాష్ట్రీయ బాలసురక్ష కార్యక్రమం (ఆర్బీఎస్కే)కింద ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వాటి వివరాలను హెల్త్ బుక్‌లెట్లలో నమోదు చేసి, రాగల ఐదేళ్లపాటు విద్యార్థి ఆరోగ్య విషయాలను ట్రాక్ చేస్తారు. విద్యార్థి కుటంబసభ్యులతో గ్రూప్ ఫొటోలు, మొక్కలు నాటడం వంటివి చేపడతారు.


మాట్లాడుతూన్న బెయేర్షెబా మినిస్ట్రీస్ అధినేత సాల్మన్ రాజు

నేటి నుంచి ఉపవాస పండుగలు

దెందులూరు ,జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ యేసుక్రీస్తు నందు భయభక్తులు కలిగి దేవునికి ఇష్టమైన రీతిలో జీవనం కొనసాగించాలని దైవజనులు బెయేర్షెబా మినిస్ట్రీస్ చర్చిల అధినేత బ్రదర్ కె.సాల్మన్ రాజు అన్నారు. శనివారం సోమవరప్పాడు పంచాయతీ పరిధిలోని వీరభద్రపురం చర్చి దేవాలయంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం నుంచి ప్రతి రోజు బెయేర్షెబా ప్రార్థన మందిరంలో 50 రోజుల పాటు ఉపవాస పండుగలను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని పలు గ్రామాలతోపాటు ఇతర దేశాల నుంచి దైవజనులు, క్రైస్తవులు వేలాదిగా వస్తారని, కావాల్సిన ఏర్పాట్లు చేశామన్నారు. విద్యార్థులు, రైతులు, సమస్యల పరిష్కారానికి దైవజనులు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారన్నారు. యేసుక్రీస్తు గీతాలాపన కోసం అనేకమంది గాయకులు ప్రార్థనల్లో పాల్గొంటారన్నారు.



శిరగాలపల్లిలో జలజీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి డాక్టర్ నిమ్మల

జగన్ రథచక్రాలు వస్తున్నాయ్.. వస్తున్నాయ్..

ప్రజల్ని తొక్కుకుంటూ వెళ్తున్నాయ్ : మంత్రి

యలమంచిలి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జగన్ రథచక్రాలు వస్తున్నాయ్.. వస్తున్నాయ్.. ప్రజలను తొక్కుకుంటూ వెళుతున్నాయ్.. అని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. మండలంలోని శిరగాలపల్లిలో రూ.76 లక్షలతో చేపట్టనున్న జల జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపనలు, రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రహదారులను మంత్రి శనివారం ప్రారంభించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం మండల టీడీపీ అధ్యక్షుడు మామిడిశెట్టి పెద్దిరాజు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ పరామర్శలకు డీజేలు, నరుకుతాం.. చంపుతాం అని ఫ్లెక్సీలతో ర్యాలీగా వెళ్లడం దేశంలో ఒక్క జగన్‌కే చెల్లిందన్నారు. సొంత బాబాయ్‌ని గొడ్డలివేటు వేయించిన వాళ్లు రప్పా.. రప్పా చంపుతామన్న వ్యాఖ్యలను సమర్థించడం ఒక లెక్కా? అని ఎద్దేవా చేశారు. రౌడీలకు, గూండాలకు, ఫ్యాక్షనిస్టులకు చంద్రబాబు పాలనలో తావులేదన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే నియోజక వర్గంలో ప్రజలకు వరదల భయం లేకుండా రూ. 16 కోట్లతో ఏటిగట్ల పటిష్ట పనులు చేపట్టామన్నారు. జగన్ పాలనలో వరదల సమయంలో వైసీపీ మంత్రులు, నాయకులు వచ్చారు.. వెళ్లారే తప్ప, ఐదేళ్లలో ఏటిగట్టు పటిష్టతకు ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదన్నారు. రైతుల కోసం నియోజక వర్గంలో రూ.100 కోట్లతో ఇరిగేషన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఏడాది పాలనలో ఉచిత గ్యాస్ సిలిండర్లు, డీఎస్సీ నోటిఫికేషన్ జారీ, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, ఎంతమంది పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం అందించామన్నారు. ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. కూటమి నాయకులు చిలుకూరి బాలాజీ, నాగ ప్రసాద్, ఎన్.నరేష్‌కుమార్‌రాజు, కడలి గోపాలరావు, మాతా రత్నంరాజు, కొడవటి వరబాబు, ఆరుమిల్లి రామశ్రీనివాస్, బొప్పన హరికిషోర్, చెరుకూరి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలు తనిఖీ చేసిన ప్రధాన న్యాయమూర్తి



రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీదేవి

నరసాపురం టౌన్, జూన్ 28(ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని సబ్ జైలును శనివారం ఉమ్మడి జిల్లాల ప్రధాన న్యాయమూర్తి ఎస్. శ్రీదేవి ఆకస్మిక తనిఖీ చేశారు. రిమాండ్ ఖైదీలకు అందుతున్న సేవలు, స్టోరేజ్, వైద్య సేవలు, ఆహార పదార్థాలు తనిఖీ చేశారు. అనంతరం ముద్దాయి లతో సమావేశమయ్యారు. ముద్దాయిలు జైలు ప్రాంగణంలోని ఉచిత న్యాయసేవా కేంద్రాన్ని సద్వినియోగపర్చుకోవాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్నప్రసాద్, న్యాయమూర్తులు గంగరాజు, ఆర్. వరలక్ష్మి, జైలర్ అప్పారావు, న్యాయవాదులు పద్మజ, వెంకటేశ్వరరావు, ప్రతిభరాణి, రవికిరణ్, జ్యోతి, సురేష్, శశికళ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

తణుకు: జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జడ్జి శ్రీదేవి అన్నారు. శనివారం తణుకులోని సబ్ జైల్‌ను సందర్శించారు. ముద్దాయిలకు అందించే ఆహారం, వసతులపై ఆరా తీశారు. జిల్లా న్యాయ సేవల సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, నాల్గో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి, న్యాయాధికారి సాయిరాం పోతర్లంక, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కామేష్, బెంచ్ కోర్టు మెజిస్ట్రేట్ తాడి ఆంజనేయులు, జైలు సూపరింటెండెంట్ మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

శిథిల వంతెనను పరిశీలించిన చీఫ్ ఇంజనీర్



శిథిల వంతెన పరిశీలిస్తున్న చీఫ్ ఇంజనీర్

ఉంగుటూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురం వంతెన శిథిలమవడంతో శనివారం ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ ఎల్.శ్రీనివాస రెడ్డి బృందం పరిశీలించింది. కొత్త వంతెన నిర్మాణంలో 11 మీటర్ల వెడల్పు, ఇరుపక్కల ఫుట్‌పాత్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. గత ప్రభుత్వంతో నిధులు మంజూరైనా మూడు సార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని నాడు అంచనా రూ.8.50 కోట్లు కాగా ప్రస్తుత నిర్మాణంలో అంచనా తగ్గిస్తామన్నారు. ఈ వంతెన డెల్టా-మెట్ట ప్రాంతాల మధ్య కీలకంగా ఉందని అందువల్ల స్థానిక ఎమ్మెల్యే ధర్మరాజు చొరవతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశీలించి ప్రత్యామ్నాయమా లేదా కొత్త వంతెన నిర్మాణమా అనే అంశంపై ఉన్నతాధికారులతో చర్చిస్తామన్నారు. వంతెనపై ట్రాఫిక్ పరిస్థితిని ఆరా తీయగా నిత్యం ఐస్ ఫ్యాక్టరీ లతో పాటు ఫిష్ ప్యాకింగ్, రవాణా వాహనాలు, లారీలు ఈ వంతెన ద్వారా ప్రయాణాలు సాగిస్తున్నాయన్నారు. జిల్లాలో ఈ ప్రాంతం లోనే ఐస్ ఫ్యాక్టరీలు ఎక్కువ ఉన్నాయని క్షత్రియ కార్పొ రేషన్ డైరెక్టర్ పొత్తూరి కృష్ణంరాజు సీఈ దృష్టికి తెచ్చారు. ఈఈ గోవిందప్ప బాలాజీ, డీఈ గోవింద మోహన్, ఏఈ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి గడప గడపకు మంచి ప్రభుత్వం

భీమవరం టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 2 నుంచి ప్రారంభించనున్న గడప గడపకు మంచి ప్రభుత్వం ప్రచార కార్యక్రమం విజయవంతం చేయాలని భీమవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి పిలుపు నిచ్చారు. నియోజకవర్గ టీడీపీ నాయకులకు అవగాహన, శిక్షణ సదస్సు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సుపరిపాలన తొలి అడుగు నినాదంతో ఏడాదిలో పూర్తిచేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు రానున్న కాలంలో అమలు చేయవలసిన ప్రణాళికలు స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలపై ప్రజలకు వివరించాలని తెలిపారు.

'అద్వికి'లో అంతా పెద్దవారే.!

రూ.300 కోట్లు వసూలు చేసి.. బోర్డు తిప్పేసిన వైనం

కృష్ణా, గుంటూరు, ప్రకాశం, ఏలూరు జిల్లాల బాధితులు ట్రేడింగ్ కంపెనీ, పీఎస్‌కు క్యూ

» పెట్టుబడులు పెట్టినవారంతా ప్రముఖులే..
» అధిక వడ్డీ ఆశ చూపిన ఎండీ ఆదిత్య
» బాధితుల గగ్గోలు



విజయవాడలో అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయం

విజయవాడ, జూన్ 28(ఆంధ్రజ్యోతి) : రూ.లక్ష పెట్టుబడి పెడితే, నెలకు రూ.6 వేలను వడ్డీగా చెల్లిస్తామని చెప్పి ఏజెంట్లు, ఖాతాదారులకు ఝలక్ ఇచ్చిన విజయవాడలోని అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎండీ తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్యతోపాటు కిరణ్ అనే ఉద్యోగిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. అయితే, ఆదిత్య చేసిన లీలలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. మొత్తం 1,200 మంది ఖాతాదారుల నుంచి రూ.300 కోట్లను పెట్టుబడిగా వసూలుచేసి బోర్డు తిప్పేయడంతో ఆయన లీలలు వెలుగులోకి వస్తున్నాయి.

ప్రముఖులే బాధితులు..

ఆదిత్య.. విజయవాడలోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎదురుగా, ఈఎస్ఐ రోడ్డులో ఉన్న ఫార్చ్యూన్ హైట్స్‌లో అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని నిర్వహిస్తున్నాడు. ఐదేళ్ల కిందట ప్రారంభించాడు. రూ. లక్ష పెట్టుబడి పెట్టినవారికి నెలకు రూ.6 వేల వడ్డీని గత డిసెంబరు వరకు చెల్లించాడు. ఆ తర్వాత నుంచి చెల్లింపులు ఆలస్యమయ్యాయి. కొంతమంది పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, టాస్క్‌ఫోర్స్ రంగంలోకి దిగింది. ఆదిత్య ఇస్తున్న వడ్డీ సాధారణ, మధ్యతరగతి వారినే కాదు.. ప్రముఖులను ఆకర్షించింది. రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు, పోలీసులు, వైద్యులు ఇక్కడ రూ.లక్షలు పెట్టుబడి పెట్టారు. రాష్ట్రమంత్రి అనుచరులు, కేంద్ర మంత్రి సహాయకులు ఉన్నట్టు తెలిసింది. ఇలా పెట్టుబడులు పెట్టిన వారికి అసలు ఆదిత్య అంటే ఎవరో తెలియదు. కొందరు వారి కుటుంబ సభ్యుల పేర్లతోను, మరికొందరు స్నేహితుల ద్వారా డబ్బు పెట్టించారు. ఒకప్పుడు భవానీపురం ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి, ఇప్పుడు నిఘా విభాగంలో పనిచేస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్ రూ.50 లక్షలను తన స్నేహితుడి ద్వారా పెట్టుబడి పెట్టించాడు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, ఏలూరు జిల్లాలకు చెందిన రాజకీయ నేతలు.. వారి అనుచరుల ద్వారా పెట్టుబడులు పెట్టించారు. ఆదిత్యతోపాటు అతడి స్నేహితుడినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని పత్రికల్లో రావడంతో ఖాతాదారులు అద్విక ట్రేడింగ్ కంపెనీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఇప్పటికే మాచవరం పోలీసులు ఆదిత్య, కిరణ్‌పై కేసు నమోదు చేశారు. శుక్రవారం మరో 20 మంది బాధితులు పోలీసుల వద్దకు వచ్చి తమ గోడు చెప్పుకొన్నారు. పోలీసులు ఆదిత్యను తీసుకుని అద్విక కార్యాలయానికి వెళ్లారు. లోపల రికార్డులను, పెట్టుబడిదారుల వివరాలను పరిశీలించారు. ఖాతాల వివరాలు తెలుసుకున్నారు. ఆదిత్య వెనుక ఇంకా మరికొంతమంది ఉన్నారని పోలీసులు గుర్తించారు.

అరెస్టుకు ముందు సమావేశం

పోలీసులు అరెస్టు చేయడానికి ముందు ఆదిత్య ఏజెంట్లతో సమావేశం నిర్వహించాడు. అప్పటికే నష్టాలు ఉన్నాయని తెలిసినా ఏజెంట్లను నమ్మించే ప్రయత్నం ఈ సమావేశంలో చేశాడు. తనను నమ్మితే మొత్తం చెల్లింపులు చేస్తానని భరోసా ఇచ్చాడు. ఇక తాము నమ్మలేమని ఏజెంట్లు మూకుమ్మడిగా చెప్పారు. ఆ సమావేశంలో ఆదిత్య ప్రసంగ వీడియోలు 'ఆంధ్రజ్యోతి'కి అందాయి.

హవాలా మార్గంలో దుబాయికి..

పెట్టుబడులుగా వసూలు చేసిన నిధులను ఆదిత్య హవాలా మార్గంలో దుబాయికి మళ్లించినట్టు పోలీసులు గుర్తించారు. దుబాయిలో షబానా అనే ట్రేడింగ్ కంపెనీకి ఈ డబ్బు వెళ్లింది. కొద్దిరోజుల కిందట ఆదిత్య తన పుట్టినరోజు వేడుకలను వైజాగ్‌లోని స్టార్ హోటల్‌లో నిర్వహించాడు. దీనికి అక్షరాలా రూ.70 లక్షలు ఖర్చయ్యింది. విజయవాడ నుంచి ఏజెంట్లను, ఉద్యోగులను విమానంలో అక్కడికి తీసుకెళ్లాడు. అంతేకాదు.. ఆదిత్య శృంగారలీలలు బయటపడుతున్నాయి. ఆదిత్య ల్యాప్‌టాప్‌ను పోలీసులు విశ్లేషించగా, అందమైన అమ్మాయిలు, ఆదిత్య నగ్నంగా ఉన్న వీడియోలను పోలీసులు గుర్తించారు. ఈ అందమైన అమ్మాయిల ఫొటోలను ఆయన ఒక ఫోల్డర్‌లో భద్రపరిచాడు.



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

రోడ్డెక్కిన పంచాయతీ కార్యదర్శులు

ఏలూరు రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి):పనిభారం తగ్గించాలని, తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం కలెక్టరేట్ వద్ద పంచాయతీ కార్యదర్శులు ఆందోళనకు దిగారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీఎల్ తనూజ, సహాయ అధ్యక్షుడు పి. ధర్మగోవిందు, కోశాధికారి వైఎంఎం సూర్యకుమార్ మాట్లాడుతూ గ్రామ సచివాలయాల అన్ని సర్వేల విధుల నుంచి పంచాయతీ కార్యదర్శులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం 1994 ద్వారా నిర్దేశించబడిన విధులను మాత్రమే తమకు అప్పగించాలని కోరారు. సచివాలయ సిబ్బంది పనులు పూర్తి చేయకపోతే పంచాయతీ కార్యదర్శిని బాధ్యులను చేస్తూ ఉన్నత అధికారులు చర్య లు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎఫ్ఎంఎస్ నిబంధనలు మార్చాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

112 పరిశ్రమలకు సింగిల్ విండో అనుమతులు



ఏలూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి):జిల్లాలో 112 పరిశ్రమలకు సింగిల్ విండో పథకం ద్వారా అనుమతులను మంజూరు చేస్తూ జిల్లా పారిశ్రామిక, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ శనివారం నిర్ణయం తీసుకుంది. ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ వెట్రిసెల్వి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సింగిల్ విండో కింద మరో 61 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, వాటిని పరిష్కరించాలన్నారు. జిల్లాలో 14 పరిశ్రమలకు యూనిట్లకు వడ్డీ, విద్యుత్, సేల్స్‌ట్యాక్స్ రాయితీల కింద రూ.3 కోట్ల44లక్షల96వేలు అందిస్తు న్నట్లు వెల్లడించారు. పరిశ్రమల కేంద్రం జీఎం సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ బాబ్జీ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజనం'లో అవకతవకలు ఉపేక్షించం



హైస్కూల్‌ను తనిఖీ చేస్తున్న జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి

భీమవరం రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పిల్లలకు పెట్టే మధ్యాహ్న భోజనంలో అవకతవకలు జరిగితే ఉపేక్షించేది లేదని పశ్చిమ గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. భీమవరం పట్టణం 4వ వార్డులో ఉన్న అల్లూరి రామకృష్ణరాజు మునిసిపల్ హైస్కూల్ (ఏఆర్‌కేఆర్)ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు వండిపెట్టే కిచెన్ రూంను, పరిసరాలను పరిశీలించారు. రాగి జావ తయారు ఎలా చేస్తున్నారు, మెనూ ఏమిటి, మెనూ ప్రకారం అన్నీ కరెక్ట్‌గా చేస్తున్నారా ? సరైన పరిమాణంలో కొలిచి వేస్తున్నారా ? వెయిటింగ్ మెషన్లు ఉపయోగిస్తున్నారా ? అని పలు ఆరాలు తీశారు. పిల్లలకు పెట్టే ఆహారంలో ఎటువంటి అవకతవకలు జరిగినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలను వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. టాయిలెట్ రూమ్‌లను పరిశీలించి వాటిలో పైపులు పగిలి ఉండ డంతో నీళ్లు సరిగా రాక పోవడం గమనించి వెంటనే రిపేరు చేయించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుపట్టీని పరిశీలించారు. ఆరుగురు ఉపాధ్యాయులు రాకపోవడం గమనించి ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుని వివరణ అడగ్గా సెలవు పెట్టారని అన్నారు. ఆరుగురు ఒకేసారి సెలవుకు కారణాలు తెలపాలని అన్నారు. పదో తరగతి క్లాస్ రూమ్‌కి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఎలా చదువుతున్నారు, ఉపాధ్యాయులు పాఠాలు ఎలా చెబుతున్నారని అంటూ కొద్దిసేపు పిల్లలతో ముచ్చటించారు.

8న మోదీ విధానాలకు వ్యతిరేకంగా సమ్మె

భీమవరం టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కార్మికులతో పాటు దేశ ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్న మోదీ విధానాలకు వ్యతిరేకంగా వచ్చే నెల 8న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు నారపల్లి రమణారావు పిలుపునిచ్చారు. శనివారం భీమవరం సీఐటీయూ కార్యాలయంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం ఎర్రంశెట్టి చిన్నసుబ్బరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న 44 రకాల కార్మిక చట్టాలను రద్దు పరచి నాలుగు లేబర్ కోడ్లను తెచ్చారని విమర్శించారు. కార్మికులకు పనిచేసే సమయం తగ్గాల్సింది పోయి మోదీ 8 గంటల నుంచి 10,12 గంటలకు పెంచుతున్నారన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్, చింతకాయల బాబూరావు పాల్గొన్నారు.



ఎస్.ఐ. కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఐజీ అశోక్

ఎస్ఐ కుటుంబానికి ఐజీ అశోక్ పరామర్శ

నరసాపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల సూర్యపేట జిల్లా కోదాడ మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆలమూరు ఎస్.ఐ. ఎం.అశోక్ కుటుంబాన్ని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ శనివారం పరామర్శించారు. పట్టణంలోని రుస్తుంబాద ప్రాంతంలో నివాసముంటున్న అశోక్ ఇంటికి వెళ్లారు. ముందుగా అశోక్ చిత్రపటానికి పూలమాలలు వేసి సెల్యూట్ కొట్టి నివాళులర్పించారు. అనంతరం అశోక్ భార్య, సోదరులను పరామర్శించారు. కుటుంబ పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం అశోక్ భార్యతో మాట్లాడారు. పిల్లల చదువులకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. విధి నిర్వహణలో చనిపోయినందున్న ప్రభుత్వ పరంగా వచ్చే పరిహారం, ఇన్సూరెన్స్, ఇతర సదుపాయాలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ధైర్యంగా ఉండాలని ఆమెకు సూచించారు. ఆయన వెంట అడిషనల్ ఎస్పీ భీమారావు, సీఐలు యాదగిరి, దుర్గాప్రసాద్, ఎస్సైలు ముత్యాలరావు, జయలక్ష్మి, వెంకట సురేష్, నాగలక్ష్మి, వాసులు ఉన్నారు.

అడిగిన డబ్బు ఇవ్వలేదని ఓ వ్యక్తి ఆత్మహత్య

టి.నర్సాపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఆటో కొనడానికి అడిగిన డబ్బు ఇవ్వలేదని కలుపుమందు తాగి ఆత్మహత్య చేసుకుని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని రాజుపోతేపల్లిలో శనివారం చోటు చేసుకుంది. రాజుపోతేపల్లికి చెందిన మహంకాళి వెంకటేశ్వరరావు(38)కు దివ్యాంగురాలైన భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆటో కొనుక్కోవడానికి డబ్బులు కావాలని భార్యను, బావ గుండు గౌరీశంకర్‌ను వెంకటేశ్వరరావు గత కొంతకాలంగా అడుగుతున్నాడు. ఈనెల 27న మరోసారి డబ్బులు డిమాండ్ చేసినా ఇవ్వకపోవడంతో గొడవపడి తన వెంట తెచ్చుకున్న కలుపుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో అతనిని బంధువులు చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. తన బావ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్‌కానిస్టేబుల్ జయరాజు తెలిపారు.

కుమార్తెలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం

తమ్మిలేరు కాలువలోకి దిగిన మహిళ గమనించి రక్షించిన స్థానికులు



కౌన్సెలింగ్ ఇస్తున్న రైల్వే ఎస్ఐ సైమన్

ఏలూరు క్రైం, జూన్ 28(ఆంధ్రజ్యోతి) : ముగ్గురు ఆడపిల్లలను పెంచే స్థోమత లేక భర్తతో గొడవపడి తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఏలూరు నగరానికి వచ్చి తమ్మిలేరు కాలువలో దిగి ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు గుర్తించి వారిని కాపాడారు. ఈ సమాచారం రైల్వే పోలీసులకు అందించడంతో రైల్వే ఎస్ఐ పి.సైమన్, కానిస్టేబుల్ విజయ్ వచ్చి వారిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చిన్న చిన్న గాయాలవడంతో ప్రాథమిక చికిత్స చేయించారు. అతని భర్తకు, కుటుంబ సభ్యులకు సమాచారమివ్వడంతో ఏలూరు వచ్చారు. శనివారం రాత్రి కౌన్సెలింగ్ చేసి వారికి అప్పగించారు. రైల్వే ఎస్ఐ సైమన్ తెలిపిన వివరాలు గుంటూరు జిల్లా తెనాలిలోని చెంచుపేట డొంక రోడ్డులో నివాసం ఉంటున్న పందల జాన్‌పాల్‌కు భార్య లక్ష్మి(24), ముగ్గురు కుమార్తెలు తన్విక (6), అన్విక(4), యాక్షిక(9) ఉన్నారు. ముగ్గురు కుమార్తెలు కావడంతో వారి పోషణ భారంగా మారడంతో భార్య భర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడి ఈ నెల 27వ తేదీ రాత్రి గొడవ పడ్డారు. దీంతో లక్ష్మి తన పెద్ద కుమార్తె తన్విక, రెండవ కుమార్తె అన్వికలను శనివారం ఉదయం తీసుకుని జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఎక్కి ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో 12.40 నిముషాలకు దిగింది. అక్కడి నుంచి సమీపంలో ఉన్న తమ్మిలేరు వాగు వద్దకు వెళ్ళారు. సాయంత్రం 4 గంటల సమయంలో తమ్మిలేరు బ్రిడ్జి వద్ద తన ఇద్దరు పిల్లలతో నీటిలోకి వెళ్లి మునిగిపోతుండగా అక్కడ గమనించిన నిమ్మకాయల యార్డు ముఠావారు, స్థానికులు గుర్తించి వెంటనే వారిని బయటకు తీశారు. ఈ సమాచారం వెంటనే రైల్వే పోలీసులకు తెలియజేయడంతో అంబులెన్సులో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.ఆ పిల్లల నుంచి జాన్‌పాల్ నెంబర్ తెలుసుకోవడంతో రైల్వే ఎస్ఐ ఫోన్ చేశారు. దీంతో లక్ష్మి భర్త జాన్‌పాల్, ఆమె అన్నయ్య కొల్లూరు వంశీలు శనివారం రాత్రి వచ్చారు. ఆకుటుంబానికి కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగించారు. సకాలంలో కాపాడిన స్థానికులను మార్కెట్ యార్డు కార్మికులను పలువురు అభినందించారు.

తాడేపల్లిగూడెంలో కూలిన పాత భవనం

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం జూబ్లి రోడ్డులో ఉన్న పురాతన భవనం ముందుభాగం శనివారం అకస్మాత్తుగా కూలిపో యింది. పురాతన భవనం కావడంతో ఇటీవల కురిసిన వర్షాలకు నాని కూలిపో యి ఉంటుందని అంతా భావిస్తున్నారు. నిత్యం రద్దిగా ఉండే జూబ్లీరోడ్డులో ఈ భవనం ఉంది. భవనం ముందుభాగం కూలిన సమయంలో స్థానికులు వెంటనే అప్రమత్తమయ్యి ఇంట్లోని వారిని బయటకు రప్పించారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో కూల్చేందుకు యజమానులు సిద్ధమయ్యారు. ఈ లోపే ఇలా జరగడంతో స్థానిక వ్యాపారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.



కూలిపోయిన భవనం ముందు భాగం



గొల్లవానితిప్ప రోడ్డులో బోదెలో తిరగబడిన రొయ్యల లోడు వ్యాన్

బోదెలో రొయ్యల లోడు లారీ బోల్తా..

భీమవరం క్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : భీమవరం శివారు గొల్లవానితిప్ప రోడ్డులో మలుపు వద్ద రొయ్యల లోడుతో వెళ్తున్న వ్యాన్ అదుపు తప్పి బోదెలోకి తిరగబడటంతో పెద్ద ప్రమాదం తప్పింది. శనివారం సాయంత్రం గొల్లవానితిప్ప వైపు నుండి భీమవరం వైపు వస్తున్న రొయ్యల లోడుతో వేగంగా వ్యాన్ వస్తుంది. మలుపులో డ్రైవర్ వ్యాన్‌ను అదుపు చేయలేకపోవడంతో అది బోదెలోకి తిరగబడింది. దీంతో రొయ్యలన్నీ బోదెలో పడిపోయాయి. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. నీరు వేగంగా వెళ్తుండటంతో రొయ్యలన్నీ బోదెలో కొట్టుకుపోయాయి. అక్కడ ఉన్న స్థానికుల సహాయంతో రొయ్యలను పైకి తీసేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు.

భార్య పుట్టింటికెళ్లిందని..

నాలుగేళ్ల కుమార్తె గొంతుకోసి తానూ గొంతుకోసుకుని

లింగపాలెం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): భార్య పుట్టిం టి నుంచి రావడం లేదనే కోపంతో నాలుగేళ్ల కుమార్తె గొంతుకోసి తండ్రి కూడా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలో చేటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ధర్మాజీగూడెం శివారు కాటంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఘంటా రాధాకృష్ణ(36) మద్యానికి బానిసయ్యాడు. అనంతరం మద్యమత్తులో ఇంటికి వచ్చి భార్యతో నిత్యం గొడవ పడుతుండటంతో భార్య విసుగుచెంది పుట్టింటికి వెళ్లింది. భార్య కాపురానికి రావడంలేదనే కోపంతో తనవద్ద ఉన్న కుమార్తె ప్రగతి(4)ని గొంతుకోసి తానుకూడా గొంతు కోసుకున్నాడు. తీవ్రంగా గాయపడి ఉన్న వీరిని చూసి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న చింతలపూడి సీఐ క్రాంతికుమార్, ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్నలు చికిత్స నిమిత్తం తమ వాహనంలో ఏలూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రాణపాయస్థితిలో ఉన్న వారిని వెంటనే స్పందించి తన వాహనంలో ఆసుపత్రికి తీసుకువెళ్లిన సిఐ క్రాంతి కుమార్‌ను గ్రామస్థులు అభినందించారు.

తిమ్మనవీడులో బంగారం, నగదు చోరీ

పెదపాడు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అప్పనవీడు పంచాయతీ తిమ్మనవీడులో దొంగలు తలుపులు బద్దలుకొట్టి చోరీకి పాల్పడినట్టు ఎస్.ఐ. కట్టా శారదా సతీశ్ తెలిపారు. తిమ్మనవీడు గ్రామానికి చెందిన తమ్మిశెట్టి రాణి తన అత్త, కుమార్తెతో కలిసి నివాసముంటోంది. కృష్ణా జిల్లా మల్లవెల్లిలోని ఓ ప్రైవేటు కంపెనీలో వీరిద్దరూ పనిచేస్తున్నారు. విధుల నుంచి శనివారం తిరిగి వచ్చేసరికే ఇంటి తలుపులు బద్దలు కొట్టి కాసు బంగారం, రూ.20 వేల నగదు, వెండి వస్తువులు దొంగిలించినట్టు పెదపాడు పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు.

కుమారుడికి విషమిచ్చి చంపిన తండ్రి అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): భార్యపై కోపంతో కుమారు డికి విషమిచ్చి చంపి తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కేసులో షోడదాసి చంద్రశేఖర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. గణపవరం మండలం జల్లికొమ్మరకు చెందిన షోడదాసి చంద్రశేఖర్‌ను రూరల్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఈనెల 25 అర్ధరాత్రి మెట్టఉప్పరగూడెం సమీపంలోని తోటల్లో కొడుకు సాత్విక్‌కు విషమిచ్చి చంపాడని తల్లి స్వరూప రూరల్ ఎస్.ఐ. ప్రసాద్‌కు ఫిర్యాదు చేసింది. ఇదే ఘటనలో విషం తీసుకుని కోలుకున్న చంద్రశేఖర్‌ను శనివారం అరెస్టు చేయగా కోర్టు రిమాండ్ విధించింది.

ఇళ్ళ మధ్యలో ఉన్న విద్యుత్ లైన్లు తొలగించాలి



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు

బుట్టాయగూడెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీలో దళితుల ఇళ్ళ మధ్యలో ఉన్న 11కెవి విద్యుత్ లైన్లను తొలగించాలని కాలనీలో నివాసం ఉంటున్న దళితులు అధికారులను కోరుతున్నారు. విద్యుత్ వైర్లు వల్ల ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ళపై నుంచి వెళుతున్న విద్యుత్ వైర్లు వద్ద కెవిపిఎస్ ఆధ్వర్యంలో దళితులు ఆందోళన చేసి విద్యుత్ ఏఈ శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం రెండు వైర్లూ ఒకదానికొకటి తగిలి మంటలు రావడంతో తీవ్ర ఆందోళనకు గురైన దళితులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో లైన్‌మెన్ వచ్చి తీగలకు వైర్లు తొడిగారని జిల్లా నాయకుడు ఎ.ఫ్రాన్సిస్ తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న వైర్లు విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు వార్డు మెంబరు కె.దుర్గారావు తెలిపారు. ఇప్పటికైన వైర్లును తొలగించి ప్రజలను ప్రమాదాల నుంచి కాపాడాలని కోరారు. ఒగ్గు లూసమ్మ, జి.రమేష్, అంజయ్య, ముక్కమ్మ, దుర్గ, అక్కమ్మ, మంగమ్మ పాల్గొన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపండి : జేసీ

ఏలూరుటూటౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని జేసీ ధాత్రిరెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లోని జేసీ కార్యాలయంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గ్రంథాలయ భవనం శిథిలావస్థలో ఉన్న కారణంగా నూతన భవన నిర్మాణానికి సంబంధించి గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ అనుమతితో నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఎర్రవరం నిర్వాసిత విద్యార్థినికి ఎంసీసీలో ఆలిండియా ర్యాంకు

జీలుగుమిల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఎర్రవరం నిర్వాసిత గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని కొవ్వాసు ప్రియాంక ఎంసీసీలో ఆలిండియా ర్యాంక్ సాధించింది. మెడికల్ కౌన్సెలింగ్ కమిటీలో ఆలిండియా ర్యాంక్ 2022 వచ్చింది. కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసి పై చదువుల కోసం జనరల్ మెడిసిన్(డీ.ఎన్.బీ) న్యూఢిల్లీలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆస్పత్రిలో చదువుతోంది. ప్రియాంక తండ్రి వెంకటేశ్వరరావు జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా, తల్లి వెంకటలక్ష్మీ గృహిణిగా ఉన్నారు.

మార్కెట్ కమిటీ నూతన డైరెక్టర్ల ఎంపిక

దెందులూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని దెందులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన డైరెక్టర్లు పుసులూరి ప్రసాద్, బాలిన కుమారి, మద్దాల దయనందరాజు, వైవాక రాజా అల్లు జ్యోతి అన్నారు. నూతన డైరెక్టర్లు మాట్లాడుతూ చింతమనేని ప్రభాకర్, చైర్మన్ గారపాటి రామసీత సహాయ సహకారాలతో అభివృద్ధి చేస్తామన్నారు. ఏఎంసీ డైరెక్టర్లుగా ఎంపిక చేసిన సభ్యులకు సిపార్సు చేసిన టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లుబాబు), నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మోతుకూరి నానిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్ యాదవ్, సంపంగి వేణు గోపాలతిలక్, గారపాటి కొండయ్య చౌదరి, బోడేటి మోహన్‌బాబు, పార్టీ మండల కార్యదర్శి నాగనబోయిన సత్యనారాయణ, ఇప్పిలి వెంకటేశ్వరరావు ఉన్నారు.

స్టార్టప్‌లపై మేనేజ్‌మెంట్ స్టడీస్ విద్యార్థినులకు సదస్సు

ఏలూరు అర్బన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ చిన్న, మధ్యతరహా పరిశ్రమల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో నూతన ఆవిష్కరణలపై సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ యువ పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోన్న ప్రోత్సాహకాలు, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నపరిశ్రమలే దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా, దిక్సూచిగా ఉంటాయని, అవకాశాల సృష్టి, అభివృద్ధి, ఆవిష్కరణలో ముందున్నాయన్నారు. స్టార్టప్‌లు, విజయవంతమైన పరిశ్రమలపై విద్యార్థినులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కళాశాల మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం హెచ్‌వోడీ విజయలక్ష్మి, వైస్‌ప్రిన్సిపాల్ సిస్టర్ సునీలారాణి, సిస్టర్ సుశీల, అధ్యాపకులు హెప్సిబా, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



ఏలూరు రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): గుడివాకలంక మోడల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు శనివారం ఏకరూప దుస్తులు, బ్యాగు, బెల్ట్‌లు గ్రామ సర్పంచ్ ఘంటసాల నాగరాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను ఉపయోగించుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారు. పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ ఘంటసాల సుబ్బారావు, టీడీపీ నాయకులు మోరు విజయరామరాజు, ఘంటశాల సుబ్రహ్మణ్యం, జయమంగళ దొరబాబు, కుటుంబరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు వారధి ట్రస్ట్ ప్రోత్సాహకాలు

జంగారెడ్డిగూడెం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): టెన్త్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన స్థానిక జడ్పీ బాలికల హైస్కూల్లో చదివిన ఇద్దరు విద్యార్థినులకు వారధి ట్రస్ట్ ద్వారా కుర్రే భరత్, జ్యోత్స్నా బిందు దంపతులు నగదు బహుమతులు శనివారం పాఠశాల వద్ద అందజేశారు. బాలికల హైస్కూల్ ప్రథమ స్థానం సాధించిన లీలా నూకారత్నానికి రూ.10,116, ద్వితీయ స్థానం సాధించిన వెంకట నాగవైష్ణవికి రూ.5116 నగదు బహుమతిని దాతలు కుర్రే జ్యోత్స్నా బిందు చేతుల మీదుగా అందజేశారు. వారధి ట్రస్ట్ వ్యవస్థాపకుడు వలవల తాతాజీ, హెచ్‌ఎం గ్లోరీ ప్రశాంతి, రాట్నాల లక్ష్మి,17 వ వార్డు కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.రామలక్ష్మి, కెఎల్ఎన్.ధనకుమార్, మద్దిపాటి శ్రీను, ఆనంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్‌జైలును తనిఖీ చేసిన సివిల్ జడ్జి

చింతలపూడి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సబ్ జైలును జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న ఆహారం, ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ఖైదీల కేసులు, వివరాలు పరిశీలించారు. వంటగది, స్టోర్ రూంను తనిఖీ చేశారు. ఎవరికైనా ఉచిత న్యాయం కావాలంటే అందుకు న్యాయవాదులను నియమిస్తామని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఖైదీలకు కొన్ని సూచనలిచ్చారు. ఆయన వెంట జైలు అధికారి కృపానందం, న్యాయవాదులు పి.వెంకటేశ్, పి.ఎల్.రాజు పాల్గొన్నారు. అనంతరం కోర్టు వద్ద మాట్లాడుతూ జూలై 5న జరిగే లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అప్పనవీడులో హనుమాన్ చాలీసా పారాయణం



పెదపాడు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అప్పనవీడు అభయాంజనేయస్వామి దేవా లయం వద్ద ముముక్షు భజనమండలి మరియు వాసవి భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో 11 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం శనివారం జరిగింది. దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద సుమారు 100 మంది మహిళలు హనుమాన్ చాలీసా పారాయణం చేయడంతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వేదికగా మారిపోయింది. తొలుత భజన మండలి సభ్యులు స్వామివా రిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు, ఈవో తారకేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జనంలో తేల్చుకుందాం

(5వ పేజీ తరువాయి)

కాలంలో కోకో, పామాయిల్, పొగాకు, ధాన్యం కొనుగోళ్లు, ఆక్వా ధరల్లో ఎగుడు, దిగుడులపై వామపక్షాలు ఆందోళనలు నిర్వహించాయి. కేంద్రంలో బీజేపీ అనుసరిస్తున్న ధోరణులను వ్యతిరేకిస్తూనే మరోవైపు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీరుతెన్నులను ఎండగట్టేందుకు ప్రయత్నిస్తున్నాయి. చింతలపూడి ఎత్తిపోతల వంటి పథకాలను పూర్తి చేయాలని మెట్ట ప్రాంతంలో నిరసనలు ఆరంభించారు. ఉద్యోగుల పక్షాన అంగన్‌వాడీ,108 సిబ్బంది సమస్యలతో పాటు మిగిలిన వాటిపై గళంవిప్పారు. టిడ్కో ఇళ్లపై విస్తృత ఆందోళనలు నిర్వహించాయి. ఈ తరహా ఉద్యమాలను మరింత విస్తృత పరచాలని సీనియర్లు సూచనలు చేస్తుండడంతో ఇక ముందు మరింతగా కేంద్ర, రాష్ట్ర తీరుతెన్నులపై తెగబడి పోరాటాలకు వామ పక్షాలు సన్నద్ధమవుతున్నాయి. మరోవైపు ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జిల్లాల పర్యటనలకు సిద్ధమయ్యారు. గురువారం ఏలూరులో జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో సమావేశమై నిత్యం ప్రజల్లో వుంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా శ్రేణులతో భీమవరంలో సమావేశం కానున్నారు. ఇలా అన్ని పార్టీలు జనం మధ్య తేల్చుకోవాలని మినీ ఫైట్‌కు సిద్ధమయ్యాయి.

సచివాలయ ఉద్యోగులకు బదిలీ కౌన్సెలింగ్

(5వ పేజీ తరువాయి)

842 మంది అర్హులు. వీరందరికి ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏలూరులోని 62 వార్డు సచివాలయాల్లో 372 మంది పని చేస్తున్నారు. వీరిలో 238 మంది కౌన్సెలింగ్‌కు అర్హులు. తాడేపల్లిగూడెం, నిడదవోలు, జంగారెడ్డిగూడెం, భీమవరం, తణుకు, పాల కొల్లు, నరసాపురం మునిసిపాలిటీల కమిషనర్లు పాల్గొన్నారు.

ముంచేసిన ఫంగస్!

(5వ పేజీ తరువాయి)

చేరింది. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ చేపలను ఉత్తరప్రదేశ్, బీహార్‌లోని కొన్ని ప్రాంతాలకు మాత్రమే ఎగుమతి చేస్తారు. కట్లా, శీలావతి చేపల మాదిరి దీనికి అన్నిచోట్ల మార్కెట్ లేదు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఎకరాకు రూ.2 లక్షలు నష్టం



- ఫంగస్ సాగులో ఎకరాకు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లుతోంది. ఫీడ్ ధరలు పెరిగినట్లు వాటి ధరలు పెరగడం లేదు, లీజు, మందులు ఇతర ఖర్చులు అధికం. మార్కెట్ అన్నిచోట్ల లేకపోవడం, పెట్టుబడికి, ధరకు సంబంధం లేకపోవడంతో నష్టపోతున్నాం. కిలోకు రూ.90 అయితే గట్టెక్కుతారు. ఖర్చులు లభిస్తాయి.

  ఆరీఫ్, ఫంగస్ రైతు



- ఫంగస్ చేపల సాగు నష్టాలను మిగులుస్తోంది. మార్కెట్‌లో ధరలు తగ్గడం, ఖర్చులు పెరగడమే ఇందుకు కారణం. మేత ధరలపై నియంత్రణ లేకపోవడం ప్రధాన కారణం.

  - శ్రావణం శివ ప్రసాద్, ఆక్వా రైతు, పెదగొన్నూరు



- ఫంగస్ చేపల సాగులో రైతులకు ఖర్చులు రావడం లేదు. ధరలు ఉన్న సమయంలో సాగు చేపడితే చేపలు పట్టే సమయానికి మార్కెట్ లేక ధరలు పడిపోతున్నాయి.

  - నచ్చిరెడ్డి శ్రీనివాసరావు, ఆక్వా రైతు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, హాజరైన పోలీస్ అధికారులు

నేరం చేయాలంటే వణుకు పుట్టాలి

అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు క్రైం, జూన్ 28(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎవరైనా నేరాలకు పాల్పడాలంటే వెన్నులో వణుకుపుట్టే విధంగా కోర్టులో ముద్దాయిలకు శిక్షలు పడాలని జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్సులో ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం సబ్ డివిజన్ల ప్రాంతాల్లోని ఎస్ఐలు, సీఐలు అన్ని పోలీస్ స్టేషన్లలోని కోర్టు కానిస్టేబుళ్లతో వీడియో కాన్ఫరెన్సును నిర్వహించారు. కొంత మంది అధికారులు నేరుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు మాట్లాడుతూ కోర్టు కేసుల్లోని సాక్ష్యులను సకాలంలో కోర్టులో హాజరుపర్చి ముద్దాయిలకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేసు నమోదు చేసిన వెంటనే అధికారులు కేసు దర్యాప్తు చేసి చార్జిషీటును కోర్టులో దాఖలు చేయాలన్నారు. ముద్దాయికి శిక్షపడటంలో ఎంతో ప్రాముఖ్యమైన బాధ్యత పోలీసు అధికారులు, కోర్టు కానిస్టేబుల్‌పై ఉందని వారు అప్రమత్తంగా విధులను నిర్వర్తించాలన్నారు. అధికారులు కోర్టు కానిస్టేబుల్ విధి నిర్వహణ చాలా ప్రాముఖ్యమైందని కోర్టులో విచారణలో ఉన్న అన్ని కేసులకు సంబంధించిన అంశాలపై అధికారులు క్షుణ్ణంగా పరిశీలన చేసి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగ నిర్వహణలో ఎవరైనా అలసత్వం వహిస్తే సహించేది లేదని శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యోగ నిర్వహణలో ప్రతిభ కనబర్చిన కోర్టు కానిస్టేబుళ్ళకు నగదు, ప్రశంసా పత్రాలతో సత్కరిస్తామన్నారు. కోర్టులో జరిగిన రోజు వారీ కార్యక్రమాలను డాక్యుమెంటు రూపంలో ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, కోర్టు మోనటరింగ్ సెల్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు, డీసీఆర్బీఎస్ఐ రాజారెడ్డి, కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

విద్యాభ్యాసంలో తల్లి పాత్రపై పోటీలు

కుక్కునూరు, జూన్28(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శనివారం విద్యార్థులకు విద్యాభ్యాసంలో తల్లి పాత్ర వ్యాస రచన, వ్యక్తిత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న విద్యార్థులకు బహుమతి ప్రదానంతో పాటు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన బుక్స్ అందజేశారు. ప్రిన్సిపల్ కే.శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ పిచ్చుక రాజు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : చింతమనేని



సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న దృశ్యం

పెదవేగి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. కూచింపూడిలో అనారోగ్య కారణాలతో బాధపడుతూ సీఎం సహాయ నిధి పథకంలో అర్జీలు సమర్పించిన పలువురు బాధితులకు విడుదలైన సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే ప్రభాకర్.. బాధితుల ఇళ్లకు శనివారం వెళ్లి అందజేశారు. అలాగే గ్రామంలో పాడైన రహదారులను పరిశీలించి, రహదారుల అభివృద్ధికి అప్పటికప్పుడే చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ సంక్షేమం- అభివృద్ధి ఏ ప్రభుత్వానికైనా రెండు కళ్లలాంటివన్నారు. ప్రజల సంక్షేమంతోపాటు గ్రామాలను అభివృద్ధి చేస్తేనే సామాజిక వికాసం సాధ్యపడుతుందన్నారు.ఆపదలో ఉన్న వారెవరైనా తన వద్దకు రావచ్చని, పార్టీలకు అతీతంగా నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో రహదారుల అభివృద్ధి లక్ష్యంగా కృషి చేస్తున్నామని, డ్రెయిన్ల నిర్వహణకు ప్రాధాన్యతనిస్తామన్నారు. పార్టీ నాయకులు తాతా సత్యనారాయణ, రామానుజం వెంకటేశ్వరరావు, గిత్తా సత్యనారాయణ, సురేశ్ పాల్గొన్నారు.

మహిళలపై లైంగిక దాడులకు పాల్పడితే సహించేది లేదు



డీఎస్పీ యు.రవిచంద్ర

జంగారెడ్డిగూడెం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): చిన్నారులు, బాలికలు, మహిళలపై లైంగిక దాడులు, అత్యాచారాలు, అఘాయిత్యాలకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తామని జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర హెచ్చరించారు. శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది ఫిబ్రవరిలో పట్టణానికి చెందిన మందుల షాపు యజమాని షేక్ ఇబ్రహీం తొమ్మిదేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడటంతో బాలిక బంధువులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామన్నారు. నేరం రుజువు కావడంతో ఏలూరు స్పెషల్ స్పీడ్ ట్రైల్, పోక్సో కోర్టు న్యాయమూర్తి నిందితుడికి 20 ఏళ్ల శిక్ష, రూ.5 వేలు జరిమానా, బాధితురాలికి రూ.50 వేల పరిహారం అందించాలని ఆదేశించినట్టు తెలిపారు. తల్లి దండ్రులు తమ ఆడ పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోవాల ని, ఎవర్నీ నమ్మవద్దని సూచించారు. ఆడ పిల్లల ప్రవ ర్తనపై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు దృష్టిపెట్టాలన్నారు. చిన్నారులు, బాలికలు, మహిళలతో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, వేధింపులకు గురి చేసినా (112)కు, శక్తి టీమ్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కుమారి

టి.నర్సాపురం, జూన్28(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను గిరిజన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జీ.నాగ రాజకుమారి తెలిపారు. మండలంలోని కృష్ణాపురంలో శనివారం ధర్తీ ఆబా జంజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్‌పై అవగాహన కల్పించారు. బంజార భజరంగి భేరీ సంఘం ఆధ్వర్యంలో మంచినీటి పైపులైన్, రోడ్లు, డ్రైనేజీ, స్మశాన వాటిక, ప్రాథమిక పాఠశాల అదనపు భవనం, మినీ వాటర్ ట్యాంక్ మొదలగు సౌకర్యాలు కల్పించాలన్నారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పాఠశాల, స్మశానవాటిక వంటి వంటి మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలోలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, వాటిని సత్వరమే గ్రామానికి కల్పించాలని కోరారు. తహసీల్దార్ సాయిబాబా, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● పోలవరం: చింతపల్లి, కల్లుమామిడి గిరిజన గ్రామాల్లో శనివారం పోలవరం ఎంపీడీవో చెరుకూరి శ్రీనివాస్ బాబు ఆధ్వర్యంలో కేంద్ర పథకాలపై అవగాహన కల్పించారు. గిరిజనులకు కుల ధ్రువీకరణ పత్రాలు అందజేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల అమలు వినియోగం అంశాలను వివరించారు. ఐటీడీఏ పీవో రాములు నాయక్, ప్రాజెక్టు ఆఫీసర్ రుషభ చతుర్వేది, పంచాయతీల అధికారులు, మండల స్థాయి అధికారులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించాలి



పరిశీలకుడిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ఏలూరు రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధికారం చేపట్టిన వెంటనే ప్రజలకు అందించిన సూపర్‌సిక్స్ పథకాలను ఇంటింటికీ వివరించాలని రూరల్ మండల టీడీపీ పరిశీలకులు ఆర్ఎన్ఆర్ నాగేశ్వరరావు అన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు నంబూరి నాగరాజు అధ్యక్షతన అబ్జర్వర్లు, క్లస్టర్ యూనిట్, బూత్ ఇన్‌చార్జీలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలాలు, గ్రామాల్లో అబ్జర్వర్లుతో కలిసి కార్యాచరణను ముందుకు తీసుకెళ్లి పార్టీ కోసం బాగా పనిచేయాలన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జీ నేతల రవి, కోఇన్‌చార్జీ నేతల రవి, కో-ఇన్‌చార్జి మోరు వీరరామ రాజు, పార్టీ మండల కార్యదర్శి పైడిపాటి శేఖర్, గ్రామాధ్యక్షుడు పాతూరి రామకృష్ణ, కె.శ్రీనాథ్, క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్‌చార్జీలు, పార్టీ అనుబంధ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించినా ఫలితం లేదు..

ప్రజలను పట్టి పీడిస్తున్న ట్రాఫిక్ సమస్య

భీమడోలు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): నాయకుల అనాలోచిత నిర్ణయాలకు అధికారులు వంత పాడటంతో భీమడోలులో గతంలో నిర్మించిన రోడ్లు ప్రస్తుతం ప్రజలకు శాపంగా మారాయి. 2014లో కోమటికుంట నుంచి వడ్లపట్ల వరకు కోట్లాది రూపాయల నిధులతో నిర్మించిన సిమెంట్, తారు రోడ్డు ప్రస్తుతం ట్రాఫిక్ ఇబ్బందులకు కేరాఫ్‌గా మారింది. ఎటు వంటి ప్రణాళిక లేకుండా ఆక్రమణలు తొలగించకుండా రోడ్డు నిర్మించడంతో ప్రస్తుతం వాహనాలు, ప్రజలు వెళ్లేందుకు నానాపాట్లు పడుతున్నారు. సాయంత్రమైతే ఇటువైపు వెళ్లే స్కూల్ బస్సులు ఎదురైతే మొత్తం ట్రాఫిక్ నిలిచిపోతోంది. బుధవారం వారాంతపు సంత రోజైతే వాహనదారులు ప్రజలు ఈ రోడ్డుపై వెళ్ళాలంటే ఆపసోపాలు పడాల్సి వస్తోంది. ఇక డ్రెయినేజీ గురించి చెప్పాల్సిన పనిలేదు, కోట్ల రూపాయలతో రోడ్డు వేసిన అధికారులు కనీసం డ్రైనేజీపై దృష్టి సారించకపోవడంతో వర్షాలకు రోడ్డంతా వరదమయమవుతోంది. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బస్సులు తిరిగే అవకాశంలేక నిలిచిపోయిన ట్రాఫిక్



కర్తదానం చేస్తున్న విద్యార్థులు

40 మంది విద్యార్థుల రక్తదానం

ఏలూరు క్రైం, జూన్ 28(ఆంధ్రజ్యోతి) : ఏలూరులోని సిఆర్ఆర్ పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 40 మంది విద్యార్థులు రక్తదానం చేశారని జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎంబీఎస్‌వి ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సిఆర్ఆర్ కళాశాల విద్యార్థులు పెద్ద ఎత్తున రక్తదానం చేయడం సంతోషకరమన్నారు. పీజీ కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాస్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామరాజు, లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ రమణ, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె వర ప్రసాదరావు, పిఆర్ఓ కెవి రమణ పాల్గొన్నారు.



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చిర్రి

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

బుట్టాయగూడెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దండి పూడి బైనేరు కొండవాగు దేవర గుండంలో ప్రమాదవశాత్తు మునిగి మరణించిన తెల్లం సీతారాముడు, తెల్లం కిషోర్, మడి దేవేంద్రకుమార్ కుటుంబ సభ్యులను శనివారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పరామర్శించారు. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం బాధకరమన్నారు. మృతుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని, సీతారాముడు భార్య రజనీకి ఉద్యోగం కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కుమార్తెకు అండగా ఉంటామని తెలిపారు. వర్షాకాలంలో ఏజెన్సీలోని వాగులు, జలాశయాలు, చెరువులు నిండి ఉంటాయని ఎవరూ వాటివైపునకు వెళ్ళకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



టీడీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలు

అభివృద్ధికి ఆకర్షితులై టీడీపీలో చేరిక

గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి

ద్వారకాతిరుమల, జూన్ 28(ఆంధ్రజ్యోతి):జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వైసీపీ కార్యకర్తలు, నాయకులు తమ పార్టీలోకి చేరుతున్నారని, రాబోయే రోజుల్లో అన్ని గ్రామాల్లోనూ వైసీపీ కనుమరుగు కానుందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని దేవినేనివారిగూడెంలో షుమారు 50కుటుంబాలకు చెందిన వైసీపీ నేతలు, కార్యకర్తలు టిడిపి కండువా కప్పుకున్నారు. రామన్నగూడె సొసైటీ మాజీ అధ్యక్షుడు చెరుకూరి ప్రసాదరావుతో సహా పలువురు ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి టీడీపీ కండువాలు కప్పి ఎమ్మెల్యే వెంకట్రాజు పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మద్దిపాటి మాట్లాడుతూ దేవినేనివారిగూడెం వద్దనున్న గుర్రాల వాగుపై బ్రిడ్జి నిర్మించేందుకు నిధులు మంజూరు చేశామని అదేవిధంగా అధ్వానంగా ఉన్న తిమ్మాపురం నుంచి వీరిశెట్టివారిగూడెం రహదారి నిర్మాణానికి కృషి చేస్తున్నట్టు వివరించారు. నేతలు పోలిన శ్రీను, లంకా సత్తిపండు, మద్రాస్ రాము, మాసిరెడ్డి హరిబాబు, ఏపూరి దాలయ్య, పసుమర్తి శేఖర్, గురజాల చంద్రరావు, జడ్పీటీసీ శామ్యూల్, జ్యోతి పాల్గొన్నారు.



రోజ్‌మేరీని సన్మానిస్తున్న దృశ్యం

పదవీ విరమణ ఉద్యోగానికే సేవకు కాదు

పెదవేగి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి అని, కానీ అది ఉద్యోగ బాధ్యతలకే తప్ప సేవకు కాదని విజయరాయి పీహెచ్‌సీ వైద్యాధికారిణి ప్రత్యూష అన్నారు. పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ), కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో) డి.రోజ్‌మేరీ పదవీ విరమణ సత్కార కార్యక్రమంలో శనివారం నిర్వహించారు. రోజ్‌మేరీని అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రత్యూష మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం సేవా మార్గాన్ని ఎంచుకుని జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలని ఆమె సూచించారు.

రంగారావు సేవలు ఆదర్శనీయం

ఏలూరు కార్పొరేషన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సీపీఐ నాయకులు బొమ్మి రంగారావు సేవలు ఆదర్శనీయమని పలువురు వక్తలు కొనియాడారు. కొత్తపేటలోని బొమ్మి రంగారావు స్మారక గ్రంథాలయం వద్ద శనివారం రంగారావు వర్ధంతి సభ జరిగింది. రంగారావు చిత్రపటానికి సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసడాంగే, మాజీ కార్పొరేటర్ ఆర్నేపల్లి మధు పాల్గొని పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు చింతల సూర్యనారాయణ, రెడ్డి నాగేశ్వరరావు, కొత్త రాము, పుప్పాల కన్నబాబు, కోలాభాస్కర్, గేదెల నాగేశ్వరారవు, ఎర్రా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు.

పీజీ సెట్ టాపర్లకు అభినందన

ఏలూరు అర్బన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి) : ఇటీవల విడుదలైన పీజీసెట్ ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పలువురు రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధించడాన్ని పురస్కరించుకుని శనివారం కళాశాల ఆవరణలో టాపర్లను అభినందించారు. ఎంఎస్సీ జువాలజీలో 16వ ర్యాంకును సాధించిన నవీన్ కుమార్‌తో పాటు, ఇతర విభాగాల్లో టాపర్లుగా నిలిచినవారిని ప్రిన్సిపాల్ గిరిబాబు అభినందించారు. అధ్యాపకులు విజయ్‌కుమార్, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన

భీమడోలు, జూన్ 28(ఆంధ్రజ్యోతి) : సూరప్పగూడెం శివారు పాతూరు ఎంపీపీ పాఠశాలను శనివారం ఎంఈవో భాస్కర్‌కుమార్ సందర్శించారు. విద్యార్థుల హాజరు శాతం, మధ్యాహ్న భోజన పథకంలో వంటకాలను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య పెరగాలన్నారు. హెచ్ఎం రఘురామరాజు, ఉపాధ్యాయులు మండే సుధాకర్ పాల్గొన్నారు.

వాటర్ ఫిల్టర్ బహూకరణ

దెందులూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): గోపన్నపాలెం హైస్కూల్‌కు వాసవీ ఇంటర్‌నేషనల్ క్లబ్ సహకారంతో రూ.16 వేల రూపాయల విలువైన వాటర్ ఫిల్టర్ బహూకరించారు. ఈ సందర్భంగా వాసవీ ఇంటర్నేషనల్ క్లబ్ వైస్ చైర్మన్ గడ్డం పవన్ కుమార్, జాయింట్ సెక్రటరీ చెక్క మోహన్‌కుమార్ మాట్లాడుతూ ఫిల్టర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గోపన్నపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం డాక్టర్ మరీదు మనోహర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు.

సాగుదారులకు పట్టాలివ్వండి

జంగారెడ్డిగూడెం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైసన్నగూడెంలో పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మైసన్నగూడెంలోని భూములను పరిశీలించారు. ఎన్నో సంవత్సరాలుగా పేదలు సాగు చేసుకుంటున్న భూములను స్థానికంగా కొందరు అధికారులను తప్పుదారి పట్టిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి సాగుదారులకు పట్టాలివ్వాలన్నారు.

పుస్తకాల పంపిణీ

చింతలపూడి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): డిఫర్ లైఫ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.10 వేల విలువైన నోట్ పుస్తకాలు, విద్యాసామగ్రి ఊటసముద్రం ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులకు నిర్వాహకులు బుచ్చిబాబు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా తమ సంస్థ 50వేల విలువగల పుస్తకాలను, ఇతర వస్తువులను అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు మంచిగా చదువుకుని అభివృద్ధిలోకి రావాలన్నారు.

డీఎస్సీ పరీక్షకు 26 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షల్లోబాగంగా శనివారం జరిగిన పరీక్షకు స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ స్కూలు కేంద్రంలో 100మంది అభ్యర్థులకుగాను 93మంది, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో 201మందికిగాను 182మంది హాజరయ్యారు. మొత్తంగా 26మంది గైర్హాజరయ్యారు.

దోమల నిర్మూలనకు చర్యలు

ఏలూరుటూటౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో 50డివిజన్స్‌లో దోమల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలస్వామి తెలిపారు. రామచంద్రరావుపేట, పవర్‌పేటలో స్ప్రేయింగ్ నిర్వహించారు. అనంతరం స్వామి మాట్లాడుతూ ప్రతీరోజు 8డివిజన్స్ చొప్పున వారంలో 50డివిజన్స్ దోమల నిర్మూలనకు యాంటీలార్వ లిక్విడ్ స్ప్రేయింగ్ చేస్తున్నామన్నారు.

దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనండి

కుక్కునూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కును కాలరాసే లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి వైసాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కుక్కునూరులో ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. దేశంలో పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం మోదీ ప్రభుత్వం కార్మికవ్యతిరేక లేబర్‌కోడ్‌లు తెచ్చిందన్నారు. లేబర్‌కోడ్స్ వలన పని ప్రదేశంలో కార్మికుల రక్షణ, ఆరోగ్య భద్రత, పనిగంటలు, వారాంతపు సెలవులు, తదితర హక్కులు కోల్పోతారని అన్నారు. 29న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో కుంజా నాగలక్ష్మి, సుజాత, రాయి రమణ, దుర్గమ్మ, వలి భాష తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

భారీ వాహనాల దారిమళ్లింపు

ఉంగుటూరు, జూన్ (ఆంధ్రజ్యోతి): నారాయణపురం వంతెనకు ఈ నెల 15న రంధ్రం పడటంతో అప్పటి నుంచి ప్రత్యామ్నాయంగా చేబ్రోలు పోలీసు స్టేషన్ పక్క రోడ్డు ద్వారా వాహనాలను ఇప్పటిదాకా అనుమతించారు. కాగా భారీ వాహనాలు వల్ల రోడ్డు దెబ్బ తింటున్న నేపథ్యంలో తేలికపాటి వాహనాలు మాత్రమే వెళ్లాలని హెచ్చరిక ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీంతో భారీ వాహనాలు తాడేపల్లిగూడెం వైపు మళ్ళిస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శుల సామూహిక సెలవు

చాట్రాయి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర సంఘం పిలుపు మేరకు, మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఒక్క రోజు సామూహిక సెలవు కోరుతూ శనివారం ఎంపీడీవో విజయలక్ష్మికి అర్జీ అందజేశారు. ఏలూరు వెళ్ళి జిల్లా కలెక్టర్‌ని కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలు వివరించటానికి ఒక్క రోజు సామూహిక సెలవు కోరామని పంచాయతీ కార్యదర్శులు చెప్పారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

నూజివీడు టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ఎస్ఆర్ఆర్ జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ఉచిత నేత్ర వైద్య పరీక్షలను నిర్వహించారు. శనివారం ప్రముఖ వైద్యులు హనుమంతరావు ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన ఖ్యాతి నేత్రాలయ వైద్యులు డాక్టర్ శ్రావణ సంధ్య బృందం 485 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 50 మంది విద్యార్థులకు కళ్ళజోళ్ళు అవసరమైనట్లు నిర్ధారించారు. వీరికి తుమ్మల నరేన్ కళ్ళజోళ్ళకు అవసరమైన ఆర్థిక సాయం అందించారు. హెచ్ఎం పుష్పలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజిలెన్స్ దాడులు.. వరి విత్తనాలు స్వాధీనం



నూజివీడు టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నూజివీడు అన్నదాత విత్తనాల షాపులో తనిఖీ చేసి రిజిస్టర్లో చూపని 92 బస్తాల వరి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే నరసింహా సీడ్స్ జనరల్ స్టోర్స్‌లో తనిఖీ చేసి 36 బస్తాల వరి విత్తనాలను సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేశారు. ఈ తనిఖీలో అన్నదాత విత్తనాల షాపులో రూ.1,03,489 విలువైన వరి విత్తనాల్ని, నరసింహా సీడ్స్ జనరల్ స్టోర్లో రూ.42,500 విలువ గల వరి విత్తనాల అమ్మకాన్ని నిలుపుదల చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ ఏవో జి. మీరయ్య, తహసీల్దార్ బి. కన్యాకుమారి, నూజివీడు మండల వ్యవసాయ అధికారి పి. చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.



చేపల చెరువుల తవ్వకాలను అడ్డుకున్న సర్పంచ్ తదితరులు

చేపల చెరువుల తవ్వకాలు అడ్డుకున్న గ్రామస్థులు

ముదినేపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వణుదుర్రులో మంచినీటి చెరువుల సరిహద్దులో చేపట్టిన చేపల చెరువు తవ్వకంపై పంచాయతీ పాలకవర్గంతోపాటు గ్రామస్థులు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఐదు ఎక్స్‌కవేటర్లతో చేపల చెరువు తవ్వకం పనులు మంచినీటి చెరువు ప్రక్కన నిర్వహిస్తుండగా, శుక్రవారం సాయంత్రం సర్పంచ్ చిన్నం సుగుణరావు ఆధ్వర్యంలో వార్డుసభ్యులు, గ్రామస్థులు అడ్డుకున్నారు. పంచాయతీ మంచినీటి చెరువు పక్కనే చెరువుల తవ్వి చేపలు, రొయ్యలు పెంచితే తాగేందుకు నీరు ఉపయోగపడుతుందా? అంటూ ధ్వజమెత్తారు. మంచినీటి చెరువు పోరంబోకును కూడా ఆక్రమించి చేపల చెరువులను తవ్వుతున్నారు. అనుమతులు లేకుండా జరుగుతున్న ఈ చెరువుల తవ్వకాలను నిలిపివేయాలని సర్పంచ్ డిమాండ్ చేశారు. గతంలో కూడా మంచినీటి చెరువులో నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని రొయ్యల చెరువుల త్రవ్వకాలను అడ్డుకున్నామని, తిరిగి ఇప్పుడు రాజకీయ అండదండలతో తిరిగి త్రవ్వకాలు ప్రారంభించారని, ఎట్టి పరిస్థితుల్లోను పనులు జరగనిచ్చేది లేదని తెలిపారు. చెరువు పోరంబోకు భూమిని సర్వే చేసి విడగొట్టాలని శనివారం తహసీల్దార్, ఎంపీడీవోకు కూడా ఫిర్యాదు చేశామని సర్పంచ్ తెలిపారు.

5న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



జడ్జి నాగశైలజ

నూజివీడు టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కారానికి సుముఖంగా ఉన్న కక్షదారుల సౌకర్యార్థం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు 15వ అదనపు జిల్లా జడ్జి ఎ. నాగశైలజ అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ జూలై 5న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్, చెక్ బౌన్స్, మోటార్ వెహికల్, సంబంధించిన కేసులను కక్షిదారులు పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ఇందుకు సంబంధించిన కక్షిదారులకు పోలీస్ అధికారులతో పాటు న్యాయవాదులు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు.

చట్టాలపై అవగాహనతో మెలగాలి



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి షేక్ పేద ఖాసిం

నూజివీడు టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహనతో ప్రతి ఒక్కరూ ఉండాలని నూజివీడు సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెదఖాసిం అన్నారు. నూజివీడులో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా 14 ఏళ్ల లోపు విద్యార్థులకు విద్యాహక్కు చట్టం కింద విద్యను అందించాల్సి ఉందన్నారు. మోటార్ వెహికల్ చట్టం ప్రకారం ఎవరైనా మైనర్లకు వాహనాలు ఇస్తే అందుకు బాధ్యులుగా వారి తల్లితండ్రులు ఉంటారన్న విషయం గుర్తించాలన్నారు. ఎస్‌కేడి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పక్కా డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన



ముదినేపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెయ్యేరు పంచా యతీ పరిధిలోని ఆటోనగర్‌లో పంచాయతీ నిధులతో చేపట్టిన పక్కా డ్రెయిన్ల నిర్మాణానికి శనివారం ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. సుమారు రూ.5 లక్షల పంచాయతీ నిధులతో ఈ పక్కా డ్రెయిన్లను నిర్మించనున్నారు. సర్పంచ్ అల్లు సుశీల, ఉప సర్పంచ్ దివి సతీష్, దాకరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు జాస్తి బాబూ రాజేంద్ర ప్రసాద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, మండల బీజేపీ అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాల వితరణ



కలిదిండి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): భాస్కరరావుపేట జడ్పీ హైస్కూల్ విద్యార్థుల కు శని వారం గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు రేమల్లి సునీల్ కుమార్, సురేష్ కుమార్ హ్యాండ్ ఇన్ హ్యాండ్ ఫౌండేషన్ ద్వారా రూ. 3 లక్షల విలువ గల బ్యాగులు, నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. సొంత ఊరిలో తాము చదువుకున్న పాఠశాల విద్యార్థులకు సాయమందించాలనే ఉద్దేశ్యంతో విద్యార్థులకు బ్యాగులు, నోటుపుస్తకాలు, పెన్నులు అందించా మన్నారు. టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, నీటి సంఘం అధ్యక్షులు మంతెన సుబ్బరాజు, సర్పంచ్ ఆనంద్ కుమార్, ఎత్తిపోతల కమిటీ ఛైర్మన్ వేగిరెడ్డి చిన్నారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆగిరిపల్లి: విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టడీ మెటీరియల్ ఉచితంగా అందించడం అభినందనీయమని ఎంఈవో-2 కొవ్వలి ఆనంద్‌కుమార్ అన్నారు. నూగొండపల్లి బేసిక్ ప్రైమరీ స్కూల్‌ను గుణదలకు చెందిన కొలుకలూరి ప్రసాద్ సందర్శించి విద్యార్థులకు నోట్ పుస్తకాలు, మెటీరియల్‌ను పాఠశాల హెచ్ఎం శ్రావణి సమక్షంలో అందజేశారు.

కైకలూరు: పేద విద్యార్థుల విద్యాభివృద్ధికై ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్ అన్నారు. శనివారం మండవల్లి ఎంపీపీ-2 పాఠశాలలో సర్వేపల్లి రాధా కృష్ణన్ విద్యామిత్ర స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. సర్పంచ్ ఝాన్సీ, టీడీపీ నాయకుడు ముళ్లపూడి సత్తిబాబు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

ఇక్కట్లు తీరేనా..?



గోనెపాడు పాఠశాల వద్ద జాతీయ రహదారిపై నిలిచిన నీరు



ముసునూరులో డ్రెయినేజీ మూసివేయడంతో రహదారిపైనే వర్షపునీరు

జాతీయ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి... పక్కనే మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల. ఎదురుగా రహదారిపై భారీగా వర్షపు నీరు చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికారులకు పట్టదాయె!

గోనెపాడులో సరైన డ్రెయినేజీ లేక రహదారిపైనే వాననీరు.. విద్యార్థుల పాట్లు

ముసునూరు బీసీ కాలనీలో తమ అవసరాలకు తెచ్చిన మట్టిని డ్రెయినేజీలో పోసేశారు!

కైకలూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కైకలూరు మండలం గోనెపాడులో మంచినీటి చెరువు పక్కనే ప్రభుత్వ పాఠశాల ఉంది. సరైన డ్రెయినేజీ లేక వర్షపు నీరు రహదారిపైనే నిలుస్తోంది. వాహనాలు రాకపోకలతో ఆ నీరు సమీప గృహాలపై, వాహనదారులపై పడుతోంది. విద్యార్థులు ఆ నీటిలోనే పాఠశాలకు వెళ్లవలసిన పరిస్థితి. వర్షపు నీటిలో విద్యార్థులను పాఠశాలలకు పంపడానికి తల్లిదండ్రులు భయప డుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ సమస్య ఉన్నా పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయకపోవడంతో విద్యార్థులు వర్షాకాలమంతా దినదిన గండంగానే గడుపుతున్నారు. వర్షపు నీరు నిలబడి రహదారిపై గోతులు ఏర్పడడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వర్షపునీరు నిలవ కుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

డ్రెయినేజీ పూడ్చేశారు!

ముసునూరు: ముసునూరు బీసీ కాలనీలో డ్రెయినేజీలో మట్టి పోయడంతో వర్షపునీరు, వాడుక నీరు సైతం రోడ్డుపైనే నిల్వ ఉంటోంది. దీంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇద్దరు వ్యక్తులు తమ అవసరానికి తోలుకున్న మట్టిని డ్రెయినేజీలో పోయడంతో ఈ సమస్య ఏర్పడింది. పోసిన మట్టిని తీయకుండా అలాగే ఉంచడంతో నీరు వెళ్ళేదారి లేక రోడ్డుపైనే ఉండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడి నీరు నిలబడి ఉండటంతో దోమల ఉధృతి పెరిగి అనారోగ్యం బారిన పడుతున్నామని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. పంచాయతీ పాలకులు, అధికారులు డ్రెయినేజీ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



పర్వతాపురంలో కల్వర్టుపై పడిన గొయ్యి

ప్రమాదకరంగా కల్వర్టు

చాట్రాయి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): నరసాపురం-చిన్నంపేట ఆర్అండ్‌బీ రహదారి(ఎన్‌సీ రోడ్డు)లో పర్వతాపురం వద్ద కల్వర్టుపై పెద్ద గొయ్యి ఏర్పడి వర్షం నీరు నిలిచి ప్రమాదకరంగా మారింది. ద్విచక్ర వాహనచోదకులు ఈ గోతిలో పడి గాయాలపాలవుతుండగా, చిన్నకార్లు కట్టలు విరిగిపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. సుమారు 20 ఏళ్ళ క్రితం నిర్మించిన ఈ కల్వర్టు రోడ్డుకు సమాంతరంగా కాకలో లెవల్‌లో ఉంది. భారీ వర్షాలు కురిసినప్పుడు తెలంగాణ నుంచి వరద పర్వతాపురం నల్లచెరువుకు వచ్చి, అక్కడ నుంచి ఈ కల్వర్టు మీదుగా ఉధృతంగా ప్రవహిస్తుంది. కల్వర్టు లో లెవల్‌లో ఉండటంతో వరద తాకిడికి ధ్వంసమైందని స్థానికులు అంటున్నారు. మంత్రి కొలుసు పార్థసారథి ఈ శిథిలమైన కల్వర్టు స్థానంలో వంతెన నిర్మాణానికి కృషి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



నూజివీడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శిగా నిమ్మగడ్డ

నూజివీడు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శిగా నిమ్మగడ్డ నరసింహ ఎన్నికయ్యారు. నరసింహతో పాటు 11 మంది కార్యవర్గ సభ్యులుగా, 39 మంది సభ్యులుగా సమితి నూజివీడు నియోజకవర్గ మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. శనివారం నూజివీడు సీపీఐ కార్యాలయం అమర భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి నాయకులు చలసాని వెంకటరామారావు, నిమ్మగడ్డ నరసింహ, కార్యవర్గ సభ్యులు మడుపల్లి నాగేంద్రరావు నియోజకవర్గ మహాసభ తీర్మానాలను, ఎన్నుకున్న కమిటీ వివరాలను వెల్లడించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం గత ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి కారణంగా పనులు నిలిచిపోయాయని ప్రస్తుత ప్రభుత్వం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలను అనుసంధానం చేస్తూ జిల్లా ముఖ్య పట్టణమైన ఏలూరుకు రవాణా సౌకర్యం కల్పించాలని, వేంపాడు అగ్రహారం భూముల సమస్యలను పరిష్కరించి సాగులో ఉన్న రైతులకు భూమిపై హక్కులు కల్పించాలని కోరారు.

నియోజకవర్గ సీపీఐ నూతన కమిటీ

నూజివీడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శిగా నిమ్మగడ్డ నరసింహం కార్యవర్గ సభ్యులుగా చాట్ల పుల్లారావు, చలసాని నరేంద్ర, మడుపల్లి నాగేంద్రరావు, రాయంకుల లక్ష్మణరావు, చంగల వెంకటేశ్వరరావు, కొక్కిరపాటి ఆనంద్, ఇవి శ్రీనివాస్, అబ్బూరి రంగారావు, ఏ రాజా, సీహెచ్ సురేష్ ఎన్నికయ్యారు. అలాగే సీనియర్ కమ్యూనిస్టు నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, చలసాని రామారావు కార్యవర్గానికి శాశ్వత ఆహ్వానితులుగా ఎన్నికయ్యారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

కలిదిండి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచటానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో వి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించి మాట్లాడుతూ పలు పాఠశాలల్లో ఇంకా ఒకటో తరగతిలో విద్యార్థులు చేరలేదన్నారు. ఇంటింటికి వెళ్లి బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించటానికి ఉపాధ్యాయులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పాఠశా లల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు.

ముంచేసిన ఫంగస్!

(5వ పేజీ తరువాయి)

చేరింది. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ చేపలను ఉత్తరప్రదేశ్, బీహార్‌లోని కొన్ని ప్రాంతాలకు మాత్రమే ఎగుమతి చేస్తారు. కట్లా, శీలావతి చేపల మాదిరి దీనికి అన్నిచోట్ల మార్కెట్ లేదు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఎకరాకు రూ.2 లక్షలు నష్టం



●'ఫంగస్ సాగులో ఎకరాకు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లుతున్నది. ఫీడ్ ధరలు పెరిగినట్లు వాటి ధరలు పెరగడం లేదు, లీజు, మందులు ఇతర ఖర్చు లు అధికం. మార్కెట్ అన్నిచోట్ల లేకపోవడం, పెట్టు బడికి, ధరకు సంబంధం లేకపోవడంతో నష్టపోతు న్నాం. కిలోకు రూ.90 అయితే గట్టెక్కుతారు. ఖర్చులు లభిస్తాయి' అని రైతు ఆరీఫ్ చెప్పారు.



●ఫంగస్ చేపల సాగు నష్టాలను మిగులుస్తోంది. మార్కెట్‌లో ధరలు తగ్గడం, ఖర్చులు పెరగడమే ఇం దుకు కారణం. మేత ధరలపై నియంత్రణ లేకపోవడం ప్రధాన కారణం.

– శ్రావణం శివ ప్రసాద్, ఆక్వా రైతు, పెదగొన్నూరు



●ఫంగస్ చేపల సాగులో రైతులకు ఖర్చులు రావ డం లేదు. ధరలు ఉన్న సమయంలో సాగు చేపడితే చేపలు పట్టే సమయానికి మార్కెట్ లేక ధరలు పడిపోతున్నాయి.

– నచ్చిరెడ్డి శ్రీనివాసరావు, ఆక్వా రైతు

భూములు స్వాధీనం చేసుకుంటున్నాం

భూములు సొసైటీ సభ్యులకు అప్పగించాలి
సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ రవి



మండవల్లి (కైకలూరు), జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ భూములు లీజుకు ఇవ్వకుండా అక్రమంగా అనుభవిస్తున్న వారు తక్షణమే తప్పుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ. రవి డిమాండ్ చేశారు. శనివారం మండవల్లి మండలం శింగనపూడిలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి గ్రామ దళితుల ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు ఎర్రజెండాలతో ఆ భూముల వరకు ర్యాలీ నిర్వహించారు. పేదలకు చెందిన సొసైటీ భూములని కొందరు అన్యాయంగా స్వాధీనం చేసుకుని లీజుదారులకు సైతం లీజు ఇవ్వకుండా అనుభవిస్తున్నారని తక్షణమే ఈ భూములను స్వాధీనం చేసుకుంటున్నామంటూ ఆయా భూముల్లో ఎర్ర జెండాలను ఎగురవేసి సొసైటీ బోర్డులను ఏర్పాటు చేశారు. మా భూములు మావే అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ సొసైటీ భూములు లీజు పేరుతో అనుభవిస్తున్న వ్యక్తుల నుంచి తక్షణమే స్వాధీనం చేసుకోవాలని, ఇప్పటివరకు ఎగ్గొట్టిన లీజు సొమ్మును వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా నాయకులు కె. శ్రీనివాసు, ఎస్ మహంకాళి, ఎమ్మార్పీ నాయకులు వై. దానియేలు, పీ ప్రసాద్, కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు కె. జగదీష్, కార్యదర్శి సుధీర్‌కుమార్, పి. దావీదు, పి. జేమ్సు పాల్గొన్నారు.

గుడ్ బై టీచర్

ఈ స్కూలుంటే వస్తాం.. లేకుంటే చదువు ఆపేస్తాం..
కోడూరు యూపీ పాఠశాల విద్యార్థులు



పాఠశాల నుంచి వెళ్ళిపోతున్న విద్యార్థులు

ముదినేపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : తాము దూరంగా ఉన్న హైస్కూళ్ళకు వెళ్ళలేమని, తమ గ్రామంలోనే యుపి పాఠశాలను కొనసాగించాలని ప్రాధేయపడుతున్న ముదినేపల్లి మండలం కోడూరు గ్రామంలో డి గ్రేడ్ అయిన మండల పరిషత్తు యుపి పాఠశాల విద్యార్థుల పట్ల అధికార్లు కనీస కనికరం చూపించడం లేదు. పాఠశాలలు తిరిగి ప్రారంభమై 16 రోజులైనా ఆ యుపి పాఠశాల కొనసాగుతుందా లేదా అన్నది అర్థంకాని అయోమయ పరిస్థితుల్లో విద్యార్థులు శనివారం ఆ పాఠశాల వద్ద ఎండలో గంటకు పైగా నిలుచుని నిరసన వ్యక్తం చేశారు. తమ గ్రామంలోని యుపి పాఠశాలను గ్రామంలోని యుపి పాఠశాలను నుంచి 6,7,8 తరగతులు నిర్వహించే విధంగా సహకరించాలని టీడీపీ నాయకుడు వల్లభనేని శివాజీని కూడా విద్యార్థులు కలిశారు. యూపీ స్కూలు ఉంటేనే తాము చదువుతాం, లేకుంటే చదువులు ఆపేస్తాం అంటూ తమ పుస్తకాల బ్యాగ్‌లను తీసుకుని విద్యార్థులు శనివారం మధ్యాహ్నం ఇళ్ళకు వెళ్ళిపోయారు. ఈ స్కూలు ఉంటేనే వస్తాం, లేకుంటే రాము గుడ్‌బై టీచర్ అంటూ హెచ్ఎం లక్ష్మికి చెప్పి విద్యార్థులు వెళ్ళిపోవడం విశేషం. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాఠశాలకు వచ్చి ఎంఈవో నరేష్ కుమార్‌కు ఫోన్ చేసి యూపీ పాఠశాల కొనసాగిస్తున్నారా లేదా..? ఎప్పటి నుంచో వున్న ఈ యూపీ స్కూలును ప్రాథమిక పాఠశాలగా ఎందుకు మార్చారు. అంటూ ధ్వజమెత్తారు. అయినా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించ లేదు. టీడీపీ నాయకులు వల్లభనేని శివాజీ, కుశ్‌కుమార్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు బదిలీ కౌన్సెలింగ్

(5వ పేజీ తరువాయి)

842 మంది అర్హులు. వీరికి ఏలూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏలూరులోని 62 వార్డు సచివాలయాల్లో 372 మంది పని చేస్తున్నారు. వీరిలో 238 మంది కౌన్సెలింగ్‌కు అర్హులు. తాడేపల్లిగూడెం, నిడద వోలు, జంగారెడ్డిగూడెం, భీమవరం, తణుకు, పాల కొల్లు, నరసాపురం మునిసిపాలిటీల కమిషనర్లు పాల్గొన్నారు.

జనంలో తేల్చుకుందాం

(5వ పేజీ తరువాయి)

కాలంలో కోకో, పామాయిల్, పొగాకు, ధాన్యం కొనుగోళ్లు, ఆక్వా ధరల్లో ఎగుడు, దిగుడులపై వామపక్షాలు ఆందోళనలు నిర్వహించాయి. కేంద్రంలో బీజేపీ అనుసరిస్తున్న ధోరణులను వ్యతిరేకిస్తూనే మరోవైపు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీరుతెన్నులను ఎండగట్టేందుకు ప్రయత్నిస్తున్నాయి. చింతలపూడి ఎత్తిపోతల వంటి పథకాలను పూర్తి చేయాలని మెట్ట ప్రాంతంలో నిరసనలు ఆరంభించారు. ఉద్యోగుల పక్షాన అంగన్‌వాడీ,108 సిబ్బంది సమస్యలతో పాటు మిగిలిన వాటిపై గళంవిప్పారు. టిడ్కో ఇళ్లపై విస్తృత ఆందోళనలు నిర్వహించాయి. ఈ తరహా ఉద్యమాలను మరింత విస్తృత పరచాలని సీనియర్లు సూచనలు చేస్తుండడంతో ఇక ముందు మరింతగా కేంద్ర, రాష్ట్ర తీరుతెన్నులపై తెగబడి పోరాటాలకు వామపక్షాలు సన్నద్ధమవుతున్నాయి.

మరోవైపు ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జిల్లాల పర్యటనలకు సిద్ధమయ్యారు. గురువారం ఏలూరులో జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో సమావేశమై నిత్యం ప్రజల్లో వుంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా శ్రేణులతో భీమవరంలో సమావేశం కానున్నారు. ఇలా అన్ని పార్టీలు జనం మధ్య తేల్చుకోవాలని మినీ ఫైట్‌కు సిద్ధమయ్యాయి.

గ్రామాల్లో సేకరించిన చెత్తతో సంపద సృష్టే లక్ష్యం

ముసునూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సేకరించిన చెత్తతో పంచాయితీలకు ఆదాయాన్ని సృష్టించడమే లక్ష్యమని ఎంపీడీవో బీఏ సత్యనారాయణ అన్నారు. శనివారం ముసునూరు, వలసపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణను ఆయన తనిఖీ చేసి, సంపద కేంద్రాల్లో వర్మీ కంపోస్ట్ తయారీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయితీలకు ఆదాయాన్ని తీసుకువచ్చే సంపద కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ

ముసునూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జీవాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు ప్రభుత్వం ఉచితంగా మందులను అందజేస్తుందని ముసునూరు పశు వైద్యాధికారి డాక్టర్ ఎం.వెంకట చైతన్య అన్నారు. శనివారం గోపవరం, గుళ్ళపూడి, వేల్పుచర్ల, బలివే గ్రామాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును ఆయన పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా ఉన్న జీవాలకు వచ్చే నెల 10వ తేదీ వరకు నట్టల మందును ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. ఈ మందును జీవాలకు వేయడం వల్ల సీజనల్ వ్యాధులు దరిచేరకుండా ఆరోగ్యంగా ఉంటాయన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలి : ఎస్ఐ

ఆగిరిపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ రక్షణ కవచం లాంటిదని, హెల్మెట్ ధరించి వాహనం నడపాలని ఎస్ఐ శుభశేఖర్ సూచించారు. విజయవాడ రోడ్‌లోని ఆగిరిపల్లి సమీపంలో పలు వాహనాలను ఆపి వాహన సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్స్‌లను పరిశీలించారు. ట్రాఫిక్ నిబంధనల ప్రకారం రాంగ్ రూట్లో వాహనం నడపడం, వాహనం నడిపే సమయంలో హెల్మెట్ ధరించకుంటే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.



నియోజకవర్గంలో వివిధ మండలాల టీడీపీ అధ్యక్షులు

టీడీపీ నూజివీడు మండల, పట్టణ అధ్యక్షులు ఏకగ్రీవం

నూజివీడు టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా మలిశెట్టి జగదీష్ మరోసారి ఎన్నిక కాగా, నుజివీడు మండల అధ్యక్షుడిగా పల్లెర్లమూడి గ్రామానికి చెందిన యనమదల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూజివీడు నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల టీడీపీ అధ్యక్ష ఎన్నికలను గత రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. ఒక్క ముసునూరు మండలం టీడీపీ అధ్యక్ష పదవికి ఎన్నిక నిర్వహించగా మిగిలిన మండలాలతో పాటు నూజివీడు మండల, పట్టణ టీడీపీ అధ్యక్ష ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. ఇప్పటి వరకు నూజివీడు పట్టణ టీడీపీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న మలిశెట్టి జగదీష్ మరోసారి పట్టణ అధ్యక్షునిగా ఎన్నికకాగా నూజివీడు మండల అధ్యక్షునిగా యనమదుల శ్రీనివాసు ఎన్నికయ్యారు. అధ్యక్ష ఎన్నికల్లో పార్టీ నాయకత్వం యువతకు ప్రాధాన్యత ఇవ్వడం విశేషం.

ముసునూరు అధ్యక్షుడిగా గార్లపాటి

ముసునూరు: ముసునూరు గ్రామ టీడీపీ నూతన అధ్యక్షుడిగా గార్లపాటి నరసింహారావు ఎంపికైనట్లు పార్టీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు తెలిపారు. నక్కా యోహాను, గార్లపాటి నరసింహారావు పోటీపడగా ఇరువురి పేర్లను పరిశీలకులు అధిష్ఠానికి పంపారు. శనివారం గార్లపాటిని నూతన అధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు రఘుబాబు తెలిపారు. స్థానిక టీడీపీ నాయకులు నరసింహారావుకు అభినందనలు తెలిపారు.

మహిళలపై కుక్కల దాడి



మహిళ కాలును గాయపరచిన దృశ్యం

ముసునూరు, జూన్ 28 (ఆంధ్ర జ్యోతి): మండ లంలోని రమణక్కపేటలో వీధి కుక్కలు శనివారం దాడి చేసిన ఘటనలో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆముదాల కుమారి, ఆముదాల అంజమ్మ నిత్యావసరాల దుకాణం వద్దకు మెయిన్ సెంటర్‌కు వెళుతున్న క్రమంలో వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేసి గాయపరచగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కొద్ది నెలలుగా పంచాయతీ పరిధిలో వీధి కుక్కలు విపరీతంగా పెరిగిపోయామని, పిల్లలు, మహిళలపై దాడికి పాల్పడుతుండటంతో భయభ్రాం తులకు గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. వీధి కుక్కల నియంత్రణకు జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సంప్రదాయబద్ధంగా గిరిజనుల పండుగ

చాట్రాయి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతనపల్లి గ్రామంలో గిరిజనులు (లంబాడాలు) శీతల పండుగను సాంప్రదాయ బద్ధంగా జరుపుకున్నారు. గ్రామంలోని గిరిజనులు అందరూ ఊరి పొలిమేరలో ఉన్న ముత్యాలమ్మ చెట్టు వద్దకు వెళ్ళి అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా ఈ పండుగను జరుపుకోవడం గిరిజనుల ఆనవాయితీ. వర్షాలు సకాలంలో కురిసి పంటలు సమృద్ధిగా పండి సుభిక్షంగా ఉండాలని ఈ పండుగ జరుపుకుంటారు. టీడీపీ మండల అధ్యక్షులు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, కుల పెద్దలు ధారావత్ పేరయ్య, భాస్కరరావు, బాణావతు పాంచాలి, ధారావత్ మల్లికార్జునరావు, మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

ముదినేపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగరాయపాలెంలో ఈ నెల 20న సాంబశివరావు అనే వ్యక్తి మద్యం సేవించి లాజర్ అనే వ్యక్తిపై దాడిచేసి గాయపరచిన ఘటనపై శనివారం ముదినేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. వారం రోజులుగా రాజీ చేసేందుకు పెద్దలు చేసిన యత్నాలు ఫలించకపోవడంతో లాజర్ శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.